# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్

### ఎన్‌జీటి పేర్కొన్న పలు కీలక అంశాలు..

(1)..సర్వే నెంబర్ 19లో 471 ఎకరాల 14 గుంటల నోటిఫైడ్ అటవీ భూమికి, సర్వేలో నమోదైన అటవీ శాఖ భూమి స్వాధీన విస్తీర్ణానికి మధ్య 35 ఎకరాల కొరత కనిపిస్తుందన్న ఎన్‌జీటి..

(2)..పాత టిప్పన్, సెత్వార్ రికార్డులు లేకపోవడంతో అటవీ, రెవెన్యూ శాఖల మధ్య సరిహద్దులపై గందరగోళం ఏర్పడినట్లు నివేదికల ద్వారా తెలుస్తుంది..

(3)..రెండు సర్వేల్లో ఎస్ఎస్ఎల్ఆర్, అటవీ శాఖ డీజీపీఎస్ సర్వేలు అటవీ భూమి మొత్తం శాఖ స్వాధీనంలో లేదని వెల్లడించాయి..

(4)..27 ఎకరాల 15 గుంటల ప్రభుత్వ భూమి, 12 ఎకరాల 26 గుంటల ప్రైవేటు పట్టా భూమి రిజర్వ్ ఫారెస్ట్ సరిహద్దు రాళ్లను దాటి లోపలకి వచ్చినట్లు నివేదికలు..

(5)..ప్రైవేటు లేఅవుట్లు, నిర్మాణాలపైనే ఫిర్యాదులు ఉండగా..! డెవలపర్లు మాత్రం పట్టా భూముల్లోనే అభివృద్ధి చేశామని వాదన..

(6)..హద్దులు స్పష్టంగా లేనందున ఎవరెంత భూమి ఆక్రమించారో ముందుగా నిర్ధారించాలని ట్రిబ్యునల్ స్పష్టీకరణ..

(7)..రాష్ట్రస్థాయి సర్వే ఆధారంగా హద్దులు నిర్ధారించి, ఆక్రమణలు తేలితే ప్రైవేటు ప్రతివాదులతో సహా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు..

(8)..పెద్ద చెరువు నాలాకు అడ్డంకులు: సర్‌ప్లస్ నాలా మళ్లింపు, నీటి ప్రవాహ సామర్థ్యం తగ్గడం, కాలువ అలైన్‌మెంట్‌లో 22 ఇళ్లు ఉన్నట్లు నీటిపారుదల శాఖ నివేదికలో పేర్కొన్నట్టు ఎన్‌జీటి జడ్జ్‌మెంట్‌లో స్పష్టంగా పేర్కొంది..

(9)..అసలు నాకా మార్గం, వెడల్పును గుర్తించి, ఆక్రమణకు గురైన నాలాను పునరుద్ధరించాలని; మరిన్ని మళ్లింపులు, ఆక్రమణలు జరగకుండా జీహెచ్ఎంసీ చర్యలు తీసుకోవాలని ఎన్‌జీటి ఆదేశించింది..

(10)..అటవీ హద్దుల ఖరారు, చట్టబద్ధ ఆక్రమణల తొలగింపు, సహజ నీటి ప్రవాహ పరిరక్షణే ప్రధాన ఉద్దేశం..

- గాజులరామారం రిజర్వ్ ఫారెస్ట్ హద్దులు 6 నెలల్లో ఖరారు చేయాలి..!
- ఆక్రమణదారులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్న "నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్"..
- పెద్ద చెరువు నాలా పాత మార్గాన్ని పునరుద్ధరించాలని ఉత్తర్వులు..!
- ఫారెస్ట్ హద్దుల్లో పట్టా భూములు..! అటవీ భూముల్లో ఆక్రమణలు..?
- సర్వేలతో బయటపడ్డ సరిహద్దుల డొల్లతనం.. అటవీ సరిహద్దుల్లో గందరగోళం.. -ప్రభుత్వ, పట్టా భూములు సైతం ఫారెస్ట్ హద్దుల్లోకి చొరబాటుపై సర్వే నివేదికలు..

# గాజులరామారంలో 35 ఎకరాలు...
# అటవీ భూమి మాయం..!



ఎన్‌జీటి ఇన్ గేట్..

- ఆరు నెలల్లో ఆక్రమణలపై చర్యలకు ఎన్‌జీటి ఆదేశాలు..!
- అటవీ భూములకు హద్దులేవీ..? పెద్దచెరువు నాలాకు దారేదీ..?

కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం రిజర్వ్ ఫారెస్ట్ భూముల వివాదంలో "జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్‌జీటి)" కీలక ఆదేశాలు జారీ చేసింది. సర్వే నెంబర్ 19లో 471 ఎకరాల 14 గుంటల నోటిఫైడ్ అటవీ భూమికి, భౌతికంగా ఉన్న భూమికి మధ్య 35 ఎకరాల వ్యత్యాసం ఉండటం..! అటవీ- రెవెన్యూ శాఖల సర్వేల్లో తేడాలు.. రిజర్వ్ ఫారెస్ట్ హద్దులను దాటి ప్రభుత్వ, ప్రైవేటు పట్టా భూములు చేరినట్లు నివేదికలు ఉన్నట్టు "ఎన్‌జీటి" పేర్కొంది..! మరోవైపు, గాజులరామారం (లేక్ఐడి నెంబర్.172) 2800 పెద్దచెరువు సహజ నాలా, సర్‌ప్లస్ కోర్సు మళ్లింపులు, నీటి ప్రవాహానికి అడ్డంకులపై ఎన్‌జీటి ఆందోళన వ్యక్తం చేసింది.. ఆక్రమణల ఆరోపణలపై తుది నిర్ధారణకు ముందే హద్దులు ఖరారు చేయాలని స్పష్టం చేసిన ట్రిబ్యునల్. రాష్ట్రస్థాయి సర్వే ఆధారంగా అటవీ భూమి సరిహద్దులను సరిచేసి, ఆక్రమణలు తేలితే ఆరు నెలల్లో చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.. సహజ నాలా(సర్‌ప్లస్) అసలు మార్గం, వెడల్పును పునరుద్ధరించి ఆక్రమణలకు తావులేకుండా చూడాలని అటవీ, నీటిపారుదల శాఖలు, జీహెచ్ఎంసీ బాధ్యతలు చేపట్టాలని నిర్దేశించింది..



చెన్నై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సౌత్ జోన్..

-4లో

# లోకాయుక్త ఆదేశాలు బేఖాతర్..!
## తూతూ మంత్రపు కూల్చివేతలతో మమ..!

- నాడు కలెక్టర్ ఆదేశాలు.. నేడు లోకాయుక్త ఆదేశాల ధిక్కరణ..?
- గాగిల్లాపూర్‌లో రోడ్డు ఆక్రమణ తొలగింపు ప్రక్రియలో అధికారుల ఉదాసీనత..




- 25 అడుగుల రోడ్డును 12 అడుగులకు కుదించినా..? చర్యలు సగం సగమే..!
- గాగిల్లాపూర్ ఆక్రమణలపై బాధితుడి ఆవేదన..
- లోకాయుక్త ఆదేశాలిచ్చినా తీరు మారని దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్..?
- నామమాత్రపు కూల్చివేతలు అంటూ బాధితుడి అసంతృప్తి..
- ఎనిమిదేళ్లుగా పోరాటం..! ఫిర్యాదులు చేసినా సమస్య పరిష్కారం కాలేదని..
- గతంలో కలెక్టర్ ఆదేశాలు కూడా లెక్కచేయక పోవడం గమనార్హం..
- తాజాగా అక్టోబర్ 4న లోకాయుక్త డిప్యూటీ డైరెక్టర్ పరిశీలించి చర్యలకు ఆదేశం..
- అయినప్పటికీ అధికారుల ధోరణిలో మార్పు శూన్యం..

-5లో

# నేటి నుంచి పలు జిల్లాల్లో భారీ వర్షాలు
## నైరుతి నిష్క్రమణం.. ఈశాన్య రుతుపవనాల ఆగమనం

**హైదరాబాద్ పెన్ పవర్:** పలు జిల్లాల్లో 15-18వ తేదీ మధ్య భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ పేర్కొంది. వర్షాలతో పాటు ఉరుములు, మెరుపులు, గంటకు 30-40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు కూడా వీస్తాయని తెలిపింది. ఈ మేరకు పలు జిల్లాలకు 'పసుపు' రంగు హెచ్చరికలు జారీ చేసింది. నైరుతి రుతుపవనాల నిష్క్రమణ రేఖ తెలంగాణలో ఖమ్మం జిల్లా మీదుగా కొనసాగుతోంది. ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడినట్లు వాతావరణ శాఖ వివరించింది. వర్ష సూచన ఉన్న జిల్లాలు: భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్- మల్కాజిగిరి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల మహబూబ్‌నగర్‌లో 37.9 డిగ్రీల ఉష్ణోగ్రత : రాష్ట్రవ్యాప్తంగా ఎండ జనాన్ని అల్లాడిస్తోంది. ప్రధానంగా మహబూబ్‌నగర్ ఉడికిపోతోంది. బుధవారం సాధారణ ఉష్ణోగ్రత 32 డిగ్రీల సెల్సియస్ నమోదు కావాల్సి



ఉండగా 5.9 డిగ్రీలు పెరిగి 37.9గా ఉంది. ఖమ్మంలో సాధారణం కన్నా 3.7 డిగ్రీలుపెరిగి 35.4, హైదరాబాద్‌లో 2.2 డిగ్రీలు పెరిగి 33.9 డిగ్రీలు నమోదైంది.

# హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ వినోద్‌కుమార్ ప్రమాణం

**హైదరాబాద్ పెన్ పవర్:** మద్రాస్ హైకోర్టు నుంచి తెలంగాణకు బదిలీపై వచ్చిన న్యాయమూర్తి జస్టిస్ తడకమల్ల వినోద్‌కుమార్ బుధవారం హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. మొదటి కోర్టు హాలులో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పి.శ్యాంకోశీ జస్టిస్ వినోద్‌కుమార్‌తో ప్రమాణం చేయించారు. అంతకుముందు రిజిస్ట్రార్ జనరల్ బదిలీ ఉత్తర్వులను, ప్రమాణ స్వీకారానికి చెందిన ఉత్తర్వులను చదివారు. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో జస్టిస్ వినోద్‌కుమార్ కుటుంబసభ్యులతో పాటు అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి, అదనపు సొలిసిటర్ జనరల్ బి.నరసింహశర్మ, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ భుజంగరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు, అదనపు అడ్వొకేట్ జనరల్లు రజనీకాంత్‌రెడ్డి, మహమ్మద్ ఇమ్రాన్‌ఖాన్, బార్ కౌన్సిల్ ఛైర్మన్ ఎస్.రాంరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# గాజులరామారంలో 35 ఎకరాలు.. అటవీ భూమి మాయం..!


ఎన్‌జీటి ఆదేశాలతో గతంలో జాయింట్ సర్వేలో భాగంగా వివిధ శాఖల యంత్రాంగం.. (ఫైల్‌ఫొటో)


జాయింట్ సర్వేలో భాగంగా అధికారుల విజిట్ నాటి..(ఫైల్‌ఫొటో)

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, అక్టోబర్ 14:** గాజులరామారం రిజర్వ్ ఫారెస్ట్ భూముల సరిహద్దుల వివాదంపై జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ) కీలక ఆదేశాలు జారీ చేసింది. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా, కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం గ్రామంలోని సర్వే నెంబర్ 19కి సంబంధించి సర్వే, సెటిల్‌మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ (ఎస్ఎస్ఎల్ఆర్) శాఖ నిర్వహించిన రాష్ట్రస్థాయి సర్వే ఆధారంగా అటవీ హద్దులను తిరిగి నిర్ధారించాలని అటవీ శాఖను ఆదేశించింది.. సరిహద్దు రాళ్లను సరిచేసి, కొత్తగా ఖరారు చేసిన హద్దుల్లో ఆక్రమణలు ఉన్నట్లు తేలితే ఆరు నెలల్లో చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. మరోవైపు, గాజులరామారం (లేక్‌ఐడి నెం.172) 2800 పెద్ద చెరువు నుంచి ప్రవహించే సహజ నాలా, సర్‌ప్లస్ కోర్సు అసలు మార్గం, వెడల్పును పునరుద్ధరించి, భవిష్యత్తులో ఎలాంటి మళ్లింపులు, అడ్డంకులు లేకుండా చూడాలని నీటిపారుదల శాఖ, జీహెచ్ఎంసీని ఆదేశించింది.. ఎన్‌జీటీ సౌత్ జోన్, చెన్నై ధర్మాసనం, జస్టిస్ పుష్ప సత్యనారాయణ, నిపుణ సభ్యుడు డాక్టర్ ప్రశాంత్ గార్గవలతో కూడిన బెంచ్-2026 అక్టోబర్ 13న ఒరిజినల్ అప్లికేషన్ నంబర్ 17/2022 (ఎస్‌జెడ్)పై ఈ తీర్పును వెలువరించింది.. అయితే, ప్రైవేటు డెవలపర్లే అటవీ భూములను ఆక్రమించారనే తుది నిర్ధారణకు రాకుండా, ముందుగా అటవీ హద్దులను శాస్త్రీయంగా ఖరారు చేసి, ఆ తర్వాత ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ఎన్‌జీటి కీలకంగా ఆదేశించింది..

## ఫారెస్ట్ ఆక్రమణలు.. 21 మందికి జీహెచ్ఎంసీ నోటీసులు..!

గాజులరామారం రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని కొన్ని ప్రాంతాలను ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించినట్లు గుర్తించి, వారిని ఖాళీ చేయించేందుకు అధికారులు చర్యలు ప్రారంభించినట్లు నివేదికలో పేర్కొన్నారు.. ఈ మేరకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ద్వారా 21 మందికి నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు.. వీరిలో ఇద్దరు వ్యక్తులు అధికారుల చర్యలను సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టులో 2020లో డబ్ల్యూపీ నంబర్ 4741/2021లో డబ్ల్యూపీ నెంబర్ 11082 దాఖలు చేయగా, ఆ పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నట్లు నివేదిక స్పష్టం చేసింది.. మరోవైపు, గాజులరామారం రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని నాలాలు, జలవనరులను ఆక్రమించలేదని నివేదికలో పేర్కొన్నారు. పిటిషనర్ ప్రస్తావించిన నాలా రిజర్వ్ ఫారెస్ట్ వెలుపల ఉందని, అది నీటిపారుదల శాఖ పరిధిలోకి వస్తుందని తెలిపారు..

**గాజులరామారం అటవీ భూముల కేసులో ఎన్‌జీటీ తీర్పు అటవీ శాఖకు స్పష్టమైన బాధ్యతను, ఆరు నెలల గడువును విధించింది. అయితే, ఈ తీర్పు అన్ని భవన నిర్మాణ అనుమతులు, ఎల్ఆర్ఎస్ అనుమతులను రద్దు చేసినట్లు కాదని. ప్రైవేటు ప్రతివాదులందరూ అటవీ భూములను ఆక్రమించినట్లు కూడా తుది నిర్ధారణ కాలేదు.. అంతకంటే ముందుగా శాస్త్రీయ సర్వే ఆధారంగా హద్దులను ఖరారు చేసి, అనంతరం అక్రమ ఆక్రమణలు ఉన్నట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నదే తీర్పు... అటవీ శాఖ ఆరు నెలల్లో హద్దులను ఎంతవరకు సరిచేస్తుంది..? 35 ఎకరాల విస్తీర్ణ వ్యత్యాసంలో వాస్తవంగా ఏ మేరకు ఆక్రమణలు ఉన్నాయో తేలాల్సి ఉంది..? పెద్ద చెరువు నాలా, సర్‌ప్లస్ కోర్సు అసలు మార్గం పూర్తిస్థాయిలో పునరుద్ధరించబడుతుందా..? అన్నది తదుపరి చర్యలపై ఆధారపడి ఉంటుంది..**

## 35 ఎకరాల అటవీ భూమి వ్యత్యాసం..

సర్వే నెంబర్ 19లో నోటిఫై చేసిన 471 ఎకరాల 14 గుంటలకు బదులుగా ఎస్ఎస్ఎల్ఆర్ సర్వే ప్రకారం అటవీ శాఖ భౌతిక స్వాధీనంలో 436 ఎకరాల 14 గుంటలే ఉన్నట్లు నమోదైంది. దీంతో 35 ఎకరాల వ్యత్యాసం కనిపించింది.. సర్వే నెంబర్లు 19, 25, 26 కలిపి 486 ఎకరాల అటవీ ప్రాంతం నోటిఫై చేయగా, అటవీ శాఖ సర్వే ప్రకారం 451 ఎకరాలు మాత్రమే ఆ శాఖ ఆధీనంలో ఉన్నట్లు వెల్లడైంది. ఇక్కడ కూడా 35 ఎకరాల వ్యత్యాసం కనిపిస్తుందని ట్రిబ్యునల్ పేర్కొంది..అయితే, ఈ మొత్తం విస్తీర్ణాన్ని పలానా వ్యక్తులు ఆక్రమించిన భూమిగా ఎన్‌జీటీ ప్రకటించలేదు.. అదే సమయంలో అటవీ శాఖ ఆధీనంలో లేని భూమితోపాటు, అటవీ భూమి కాని ప్రాంతాలను కూడా పొరపాటున అటవీ హద్దుల్లో చేర్చారా అనే అంశాన్ని, సర్వే ఆధారంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని ఎన్‌జీటి స్పష్టం చేసింది..

## ప్రభుత్వ, పట్టా భూములు కూడా అటవీ భూమిలోకి..!

ఎస్ఎస్ఎల్ఆర్ నివేదికలో మరో కీలక అంశం వెలుగులోకి వచ్చింది. ప్రస్తుత అటవీ సరిహద్దు రాళ్లు, ఫెన్సింగ్ ఏర్పాటు సమయంలో పక్కనున్న ప్రభుత్వ, ప్రైవేటు పట్టా భూములు కూడా అటవీశాఖ భూమిని స్వాధీన పరుచుకున్నట్లు నివేదికలో పేర్కొన్న విషయాన్ని "ఎన్‌జీటి" ప్రస్తావించింది.. సర్వే నెంబర్లు 12, 24, 25, 26, 27, పరిధిలోని 27 ఎకరాల 15 గుంటల ప్రభుత్వ భూమి కాగా..! సర్వే నెంబర్లు 28, 20, 18, 16, 15, 396, 445, పరిధిలోని 12 ఎకరాల 26 గుంటల పట్టా భూమి అటవీ శాఖ ఆధీనంలో ఉందని నివేదికలో పేర్కొంది.. దీంతో అటవీ భూములను ఆక్రమణల నుంచి రక్షించడమే కాకుండా, అటవీ భూమి కాని ప్రాంతాలు తప్పుగా హద్దుల్లోకి చేరి ఉంటే వాటిని కూడా సర్వే ఆధారంగా గుర్తించి సరిహద్దులను సరిచేయాల్సి ఉందని ఎన్‌జీట స్పష్టం చేసింది..

## డెవలపర్ల వాదనలు.. తుది నిర్ధారణకు హద్దులే కీలకం..

అటు ప్రైవేటు డెవలపర్లు తమపై వచ్చిన ఆరోపణలను ఖండించారు.. సర్వే నెంబర్లు 14, 15, 28, 445 పరిధిలోని ప్రైవేటు పట్టా భూముల్లోనే అభివృద్ధి పనులు చేపట్టామని, భూముల యజమానులతో చట్టబద్ధమైన అభివృద్ధి ఒప్పందాలు చేసుకున్నామని వాదించారు. అటవీ భూముల ఆక్రమణలు, సహజ నాలాల అడ్డంకులు, పర్యావరణ చట్టాల ఉల్లంఘనలతో తమకు సంబంధం లేదని తెలిపారు. అటవీశాఖకి చెందిన సరిహద్దు పిల్లర్‌ల కారణంగా, తమ పట్టా భూములు కొంతభాగం రిజర్వ్ ఫారెస్ట్ లోపల ఉన్నట్లు సర్వే నివేదికలు సూచిస్తున్నాయని వారి వాదనలని ఎన్‌జీటి తీర్పులో పేర్కొంది.. జిల్లా కలెక్టర్ నివేదికలో ప్రైవేటు ప్రతివాదులు సర్వే నెంబర్ 19లో 37 గుంటల ప్రభుత్వ భూమిని అనధికారికంగా ఆక్రమించినట్లు పేర్కొన్నప్పటికీ, రాష్ట్రస్థాయి సర్వే నివేదికలో మాత్రం ఆ ఆక్రమణను నిర్ధారించలేదని ధర్మాసనం గమనించింది.. అందువల్ల హద్దులు స్పష్టంగా లేనప్పుడు ఎవరు ఎంత భూమిని ఆక్రమించారనే అంశంపై తుది నిర్ధారణకు రావడం కష్టమని ఎన్‌జీటి వెల్లడించింది.. అందుకే ముందుగా అటవీ సరిహద్దులను ఖరారు చేసి, హద్దు రాళ్లను ఏర్పాటు చేసిన తర్వాతే ఆక్రమణలను నిర్ధారించి చర్యలు తీసుకోవాలని ఆదేశించింది..



పిటిషనర్ కిరణ్‌కుమార్‌కు ఆర్టీఐ యాక్ట్ కింద, డిప్యూటీ తహశీల్దార్ జారీచేసిన సర్వే స్కెచ్ మ్యాప్..



పిటిషనర్ కిరణ్ కుమార్‌కి చెందిన భూమిలో వ్యవసాయ నాలా ఉన్నట్టు టంచ్‌మ్యాప్..

## 2019 నుంచి ఫిర్యాదులు.. అయినా తేలని హద్దులు..!

గాజులరామారం గ్రామంలోని సర్వే నెంబర్ 19లో 471 ఎకరాల 14 గుంటల భూమి నోటిఫై చేసిన రిజర్వ్ ఫారెస్ట్‌గా ఉందని పిటిషనర్ కిరణ్ కుమార్ పేర్కొన్నారు. ఈ భూమిలోని కొన్ని ప్రాంతాలను ప్రైవేటు వ్యక్తులు, రియల్ ఎస్టేట్ డెవలపర్లు ఆక్రమించి లేఅవుట్లు, రిజిస్ట్రేషన్లు, నిర్మాణాలు చేపడుతున్నారన్నది ప్రధాన ఆరోపణ.. ఈ విషయంపై 2019 నుంచి అటవీ, రెవెన్యూ శాఖలు, హెచ్ఎండీఏ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదులు చేసినట్లు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పులో ప్రస్తావించింది. అటవీ భూముల రక్షణతోపాటు, పెద్ద చెరువు నుంచి చిత్తారమ్మ ఆలయం వైపు వెళ్లే 30 అడుగుల ఓపెన్ నాలాలో అడ్డంకులను తొలగించాలని, అనధికారిక నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని పిటిషనర్ కోరారు.. అటవీ భూమికి ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో మంజూరైన ఎల్ఆర్ఎస్, నిర్మాణ అనుమతులను పరిశీలించాలని కూడా పిటిషనర్ విజ్ఞప్తి చేశారు..



స్కెచ్ మ్యాప్‌లో పెద్దచెరువు నుండి రెండు నాలాలు ఉన్నట్లు స్పష్టం..

## ఒకే సర్వే నెంబర్.. భిన్నమైన నివేదికలు..!

సర్వే నెంబర్ 19కి సంబంధించిన అసలు హద్దులపై అధికారిక రికార్డుల్లో స్పష్టత లేకపోవడమే ఈ వివాదానికి ప్రధాన కారణమని ఎన్‌జీటీ గుర్తించింది.. 1957 నాటి గ్రామ కడస్ట్రల్ మ్యాప్, 1958--59 పహాణీ వివరాలు, ఇతర సర్వే రికార్డుల్లో వ్యత్యాసాలు ఉన్నాయి.. అసలు టిప్పన్, సెత్వార్ రికార్డులు అందుబాటులో లేకపోవడంతో చుట్టుపక్కల సర్వే నెంబర్ల రికార్డుల ఆధారంగా హద్దులను గుర్తించాల్సి వచ్చిందని సంయుక్త కమిటీ పేర్కొంది.. ఈ నేపథ్యంలో ఎస్ఎస్ఎల్ఆర్ శాఖ రాష్ట్రస్థాయి సర్వే నిర్వహించగా, అటవీ శాఖ డీజీపీఎస్ సాంకేతికతతో మరో సర్వే చేపట్టింది.. అయితే, రెండు నివేదికలకు పూర్తిగా పొంతనలేదని ఎన్‌జీటి స్పష్టతను ఇచ్చింది.. 1957 నాటి మ్యాప్‌తో పోల్చినప్పుడు ప్రస్తుతం ఏర్పాటు చేసిన రిజర్వ్ ఫారెస్ట్ సరిహద్దు రాళ్లు, ఫెన్సింగ్ అసలు నోటిఫై చేసిన హద్దులకు అనుగుణంగా లేవని రాష్ట్రస్థాయి సర్వేలో తేలినట్లు ఎన్‌జీటి తీర్పులో పేర్కొంది..

## పెద్దచెరువు నాలా.. నీటి ప్రవాహానికి అడ్డంకులు..

ఈ కేసులో గాజులరామారం పెద్ద చెరువు నుంచి బయటకు వెళ్లే సహజ నాలా, సర్‌ప్లస్ నీటి మార్గం, వెడల్పు అంశాలనూ ఎన్‌జీటీ పరిశీలించింది. నాలా మార్గాన్ని మార్చడం, కొన్ని ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టడం వల్ల నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడ్డాయని జాయింట్ కమిటీ గుర్తించినట్లు ఎన్‌జీటి పేర్కొంది.. నీటిపారుదల శాఖ నివేదిక ప్రకారం, పెద్ద చెరువు సర్‌ప్లస్ నాలా వెడల్పు 9.5 మీటర్లు.. కాగా లేఅవుట్ల అభివృద్ధి సమయంలో అసలు మార్గాన్ని పైప్‌లైన్ల ద్వారా మళ్లించినట్లు ఇరిగేషన్ శాఖ నివేదికలో పేర్కొంది.. దీనివల్ల నీటిని బయటకు పంపే సామర్థ్యం తగ్గి, వర్షాకాలంలో లేఅవుట్లలో నీరు నిలిచి, కాలనీలు మునిగే విపత్కర పరిస్థితి ఏర్పడుతున్నట్లు వెల్లడించింది. అలాగే, 1.80 మీటర్ల వెడల్పు గల నీటిపారుదల కాలువ అలైన్‌మెంట్‌లో 22 నివాస గృహాలు ఉన్నట్లు తెలిపింది.. అయితే, సంబంధిత నివాస లేఅవుట్లు పెద్ద చెరువు క్యాచ్‌మెంట్ ప్రాంతంలో కాకుండా అవుట్‌లెట్ వీర్‌కు దిగువన ఉన్నట్లు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి తన నివేదికలో పేర్కొంది.. ఈ భిన్నమైన నివేదికలను పరిశీలించిన ఎన్‌జీటీ, సహజ నీటి ప్రవాహ మార్గాల, వెడల్పును గుర్తించి పునరుద్ధరించే పనులు చేపట్టాలని స్పష్టం చేసింది..


పెన్ పవర్
సోమవారం 5 అక్టోబర్ 2026
3
పెన్ పవర్
తెలంగాణ రౌండప్
25 అడుగుల రోడ్డును..
12 అడుగులకు కుదించారు..!
కలెక్టర్ ఆదేశాలూ లెక్కచేయలేదు..!
- గాగిల్లాపూర్‌లో కబ్జాదారుల దూకుడు.. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం..!
- సుమారు ఎనిమిదేళ్లుగా ఈ రోడ్డు కబ్జాపై పోరాటం చేస్తున్నామన్న బాధితులు..
- బాధితుల ఫిర్యాదుతో లోకాయుక్త డిప్యూటీ డైరెక్టర్ పి.జైపాల్ పరిశీలన..!
- దుండిగల్ మున్సిపల్ అధికారుల మౌనంపై లేవనెత్తుతున్న ప్రశ్నలు..!?
- రోడ్డు కబ్జా కనిపించలేదా..? లేక కనిపించినా పట్టించుకోలేదా..? తాంబూలం అడ్డొచ్చిందా..?




# లోకాయుక్త ఆదేశాలు బేఖాతర్..!
# తూతూ మంత్రపు కూల్చివేతలతో మమ..!

- 25 అడుగుల రోడ్డును 12 అడుగులకు కుదించినా..? చర్యలు సగం సగమే..!
- గాగిల్లాపూర్ ఆక్రమణలపై బాధితుడి ఆవేదన..
- లోకాయుక్త ఆదేశాలిచ్చినా తీరు మారని దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్..?
- నామమాత్రపు కూల్చివేతలు అంటూ బాధితుడి అసంతృప్తి..
- ఎనిమిదేళ్లుగా పోరాటం..! ఫిర్యాదులు చేసినా సమస్య పరిష్కారం కాలేదని..
- గతంలో కలెక్టర్ ఆదేశాలు కూడా లెక్కచేయక పోవడం గమనార్హం..
- తాజాగా అక్టోబర్ 4న లోకాయుక్త డిప్యూటీ డైరెక్టర్ పరిశీలించి చర్యలకు ఆదేశం..
- అయినప్పటికీ అధికారుల ధోరణిలో మార్పు శూన్యం..

## • నాడు కలెక్టర్ ఆదేశాలు.. నేడు లోకాయుక్త ఆదేశాల ధిక్కరణ..?
## •గాగిల్లాపూర్‌లో రోడ్డు ఆక్రమణ తొలగింపు ప్రక్రియలో అధికారుల ఉదాసీనత..

**సిఎంసి బ్యూరో, పెన్ పవర్, అక్టోబర్ 14:** ప్రజల రాకపోకల కోసం కేటాయించిన రహదారిని ఆక్రమించి, 25 అడుగుల రోడ్డును 12 అడుగులకు కుదించినా సంబంధిత మున్సిపల్ అధికారులకు ఏ మాత్రం పట్టింపు లేకపోవడం బాధాకరమని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.. గతంలోనే ఆక్రమణలు తొలగించాలని కలెక్టర్ ఆదేశాలు ఉన్నప్పటికీ నిర్లక్ష్యం వహించారు.. తాజాగా ఈనెల 4న లోకాయుక్త డిప్యూటీ డైరెక్టర్ పి.జైపాల్ గాగిల్లాపూర్ విలేజ్‌లో పర్యటించి రోడ్డు ఆక్రమణలను పరిశీలించారు.. అయినప్పటికీ సమస్యకు పరిష్కారం లభించడం లేదని.. అందుకు అధికారులే కారణమని ఆరోపణలు వినిపిస్తున్నాయి.. గాగిల్లాపూర్‌లో రహదారి ఆక్రమణలపై బుధవారం చేపట్టిన కూల్చివేతల వ్యవహారంలో దుండిగల్ సర్కిల్-59 టౌన్‌ప్లానింగ్ అధికారుల పనితీరుపై మరిన్ని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.. సుమారు ఎనిమిదేళ్లుగా రోడ్డు ఆక్రమణలపై పోరాడుతున్నా న్యాయం జరగడం లేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తుండగా.. తాజాగా చేపట్టిన కూల్చివేతలు సైతం మొక్కుబడిగా సాగాయని, సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నాడు..



చిత్రంలో కనిపించే రేకులు తొలగించి మమః అనిపించారు..


జేసిబితో వెళ్ళి కూల్చివేసిన ఐరన్ రేకులు..

దుండిగల్ సర్కిల్-59 టౌన్‌ప్లానింగ్ విభాగం పనితీరుపై బాధితులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.. ముఖ్యంగా టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్ వ్యవహారశైలిపై బాధితుడి సంచలన ఆరోపణలు టౌన్‌ప్లానింగ్ విభాగంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.. లోకాయుక్త ఆదేశాల అమలులోనూ, ఏసిపి నిర్లక్ష్యం ప్రదర్శించారని పేర్కొంటున్నాడు.. మరోవైపు తను అసంపూర్తి చర్యలపై టౌన్‌ప్లానింగ్ అధికారిని ప్రశ్నించగా, మిగతా నిర్మాణాలు కూల్చివేయలేమని, దానికి నోటీసులు జారీ ప్రక్రియ ఒకటి ఉంటుందని చెప్పాడట.. అదే సమయంలో ఈ ఒక్కసారి దీనిని వదిలేయమని ఫిర్యాదు దారునితో ఏసీపీ శ్రీనివాస్ బ్రతిమాలడం గమనార్హం..



## లోకాయుక్త ఆదేశాలు బేఖాతర్..

లోకాయుక్త ఆదేశాల నేపథ్యంలో బుధవారం చేపట్టిన కూల్చివేతలపై బాధితుడు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. రహదారి ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సి ఉండగా, నామమాత్రపు చర్యలతో సరిపెట్టారని ఆరోపించాడు.. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి, ఆక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు.. లోకాయుక్త డిప్యూటీ డైరెక్టర్ పర్యటన అనంతరం కూడా పరిస్థితిలో ఆశించిన మార్పు కనిపించకపోవడం అధికారుల బాధ్యతా రాహిత్యంతో వ్యవహరించడంపై అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నాడు..

## లోకాయుక్త అదేశించినా అసంపూర్తి చర్యలే..!

గాగిల్లాపూర్‌లోని సర్వే నెంబర్లు 185, 186 పరిధిలోని రహదారి ఆక్రమణలపై బాధితులు పలుమార్లు ఫిర్యాదుల నేపథ్యంలో లోకాయుక్త ఇన్వెస్టిగేషన్ డిప్యూటీ డైరెక్టర్ పి.జైపాల్ ఇటీవల గాగిల్లాపూర్‌లోని వివాదాస్పద రహదారిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.. సర్వే నెంబర్లు 185, 186 పరిధిలో రహదారి ఆక్రమణలపై సంబంధిత అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించి, అక్రమ నిర్మాణాలను తొలగించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.. ఈ పర్యటనతోనైనా రహదారి ఆక్రమణల సమస్యకు పరిష్కారం లభిస్తుందని బాధితులు ఆశించారు.. అయితే, లోకాయుక్త స్థాయి అధికారి స్వయంగా పరిశీలించి చర్యలకు ఆదేశించినప్పటికీ.. కూల్చివేతలు నామమాత్రంగానే ఉన్నాయని బాధితుడు ఆరోపిస్తున్నాడు.. బుధవారం దుండిగల్ సర్కిల్-59 సిఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారి ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేపట్టిన కూల్చివేతలు అక్రమార్కులకు అనుకూలంగానే ఉన్నాయని, లోకాయుక్తకు నివేదికల కోసమే అన్నట్టు చర్యలు తీసుకున్నారని ఫిర్యాదు దారుడు ఆరోపించారు.. రహదారిని పూర్తిస్థాయిలో ఆక్రమణల నుంచి విముక్తి కల్పించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా చర్యలు ఉండాలని, ఫొటోలు తీసి పనులు పూర్తయినట్లు చూపించడం వల్ల సమస్య పరిష్కారం కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు..



## ఘనంగా జీజేఆర్ కన్వెన్షన్ హాల్ ప్రారంభించిన: ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి...

కోహెడలో నూతన కన్వెన్షన్ హాల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



హైదరాబాద్ పెన్ పవర్:

ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని తొర్రూరు డివిజన్ కోహెడలో నూతనంగా ఏర్పాటు చేసిన జీజేఆర్ కన్వెన్షన్ హాల్ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరై కన్వెన్షన్ హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. నూతనంగా ఏర్పాటు చేసిన కన్వెన్షన్ హాల్ స్థానిక ప్రజలకు వివిధ శుభకార్యాలు, వేడుకలు నిర్వహించుకునేందుకు ఉపయోగకరంగా ఉంటదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వెన్షన్ హాల్ నిర్వాహకులు దయాకర్ రెడ్డి, ఆనంద్, నాయకులు ఎలిమినేటి నరసింహారెడ్డి, వంగేటి గోపాల్ రెడ్డి, కొంతం వెంకట్ రెడ్డి, పలువురు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## అహింసతోనే నిజమైన భక్తి.. మూగజీవాల రక్షణకు పిలుపు

ఉప్పల్ మెట్రో స్టేషన్ వద్ద అహింసా పరమో ధర్మః ఫౌండేషన్ అవగాహన కార్యక్రమం..




హైదరాబాద్ పెన్ పవర్: ప్రతి ప్రాణిపై ప్రేమ, కరుణ చూపడమే నిజమైన భక్తి అని అహింసా పరమో ధర్మః ఫౌండేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. జీవహింసను నివారించి మూగజీవాలను రక్షించాలనే సందేశంతో బుధవారం ఉప్పల్ మెట్రో స్టేషన్ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ దుర్గామాత శక్తి, ధైర్యం, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని తెలిపారు. భక్తి పేరుతో జంతువులను హింసించకుండా, అహంకారం, కోపం, ద్వేషాన్ని విడిచిపెట్టి సమస్త జీవుల పట్ల దయ చూపాలని పిలుపునిచ్చారు. జంతుబలికి బదులుగా పండ్లు, పూలు, కొబ్బరికాయలు, గుమ్మడికాయలు సమర్పించే అహింసాయుత పద్ధతులను ప్రోత్సహించాలని కోరారు. ఈ ప్రచారం ఏ మతానికీ, సంప్రదాయానికీ వ్యతిరేకం కాదని, అన్ని సంప్రదాయాలను గౌరవిస్తూ కరుణతో కూడిన సమాజ నిర్మాణమే లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో భాగంగా పాల్గొన్న వారికి పనసకాయ బిర్యానీతో పాటు మొక్కల ఆధారిత పోషకాహారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పీఎస్ఎస్ఎం మూవ్‌మెంట్ ట్రస్టీ కూకట్‌పల్లి లక్ష్మి, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పుల్లూరి సంతోష్ కుమార్, చిలకయ్య, బృంద సభ్యులు పాల్గొన్నారు. విద్యార్థులు, యువత, కుటుంబాలు, ఆధ్యాత్మిక సంస్థలు అహింస, జీవకారుణ్య సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్వాహకులు కోరారు.

## తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కో చైర్మన్ గా పూలరవీందర్

హైదరాబాద్ పెన్ పవర్:



హైదరాబాదులోని బషీర్బాగ్ క్లబ్ లో మంగళవారం తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ సమావేశం నిర్వహించరు . ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్గా చెరుకు రామచందర్ కో చైర్మన్గా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందినటువంటి మాల మహానాడు జిల్లా అధ్యక్షులు పూల రవీందర్ ని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ కోచేర్మన్గా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పూల రవీందర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ కో చైర్మన్గా ఎన్నుకున్నందుకుగాను మాల సంఘాల నాయకులందరికీ ప్రత్యేకంగా మాల జేఏసీ చైర్మన్ చెరుకు రామచంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి నరసింహారావు, కనకయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో మాలలు ఎదుర్కొంటున్నటువంటి ప్రధాన సమస్య ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మరియు రోస్టర్ పాయింట్ల లో జరిగిన అన్యాయంపై రాజీలేని పోరాటం చేస్తానని, మాలల ఐక్యత కొరకు పాటు పడతానని అదేవిధంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కొరకు పాటుపడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రంలోని వివిధ మాల సంఘాల అధ్యక్షులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ భద్రకాళి దేవాలయంలో శాఖంబరి ఉత్సవాలు నాలుగో రోజుకు చేరుకున్నాయి



హైదరాబాద్ పెన్ పవర్:

కాకతీయుల రాజధాని ఏకశిలానగరంగా చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో దేవీ శరన్నవరాత్ర మహటరీత్సవములు నాల్గవ రోజుకు చేరుకున్నాయి. ఉదయం గం౹ 04-00లకు నిత్యాహ్నికం నిర్వర్తించిన పిమ్మట అమ్మవారిని మహాలక్ష్మ. గా అలంకరించి పూజారాధనలు జరిపారు. మంత్రదీక్ష తీసుకొని సాధకుడు మంత్రానుష్టానం చేస్తుండగా అమ్మవారు ధనమూలమిదం జగత్ అని కదా అందుకోసం సాధకుడి అనుష్ఠానం పట్ల ప్రసన్నమైన అమ్మవారు సాధకుడికి అమితమైన ఐశ్వర్యాన్నిస్తుంది అనటానికి సంకేతంగా అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించడంలోని నేపధ్యం, నవరాత్రులలో మహాలక్ష్మి రూపంలోని దర్శించిన భక్తులకు అఖండలక్ష్మి ప్రాప్తి కలిగిస్తుంది. నవదుర్గా కల్పోక్త నవరాత్ర పూజా విధానాన్ని అనుసరించి అమ్మవారిని కూష్మాండీ మరియు గిరిజ క్రమాలలో పూజారాధనలు జరిపారు. ఈ రోజు సాధకుని మనస్సు అనాహత చక్రం నందు స్థిరమౌతుంది. కావున ఈ దినమున సాధకుడు మిక్కిలి పవిత్రమైన మనస్సుతో కూష్మాండాదేవి స్వరూపాన్ని ధ్యానిస్తూ పూజలు జరపాలి. తద్వార అమ్మవారు భక్తుడి ఉపాసనకు పరితృప్తయై అసురీ శక్తులను భక్తుల నుండి దూరం చేస్తుంది. గిరిజా క్రమంలో ఆరాధింపబడిన అమ్మవారు సాధకులకు సకల సౌభాగ్యాలు ప్రాప్తింప జేస్తుంది. ఈ రోజు అమ్మవారిని ఉదయం సూర్యప్రభ వాహనం మీద సాయంకాలం హంస వాహనం మీద ఊరేగింపు జరిపారు. ఉదయం సూర్యప్రభ వాహనం మీద సావిత్రిగా అలంకరించి సాయంకాలం హంస వాహనంపై బ్రాహ్మీమాతగా అలంకరించి ఊరేగించారు. సూర్యప్రభ వాహనం మీద సావిత్రి మాతగా ఊరేగుతున్న అమ్మవారిని దర్శించిన వారికి ధర్మశ్రద్ధ ఏర్పడుతుంది. యతో ధర్మ స్థతో జయ అని కదా శాస్త్ర వచనం. ధర్మాన్ని నమ్ముకున్నవాడు విజయం సాధిస్తాడు. అట్లాగే హంస వాహనం మీద బ్రహ్మీమాతగా ఊరేగుతున్న అమ్మవారిని దర్శించడం వలన మేధాశక్తి కలిగి ఉంటాడు. మంచి, చెడు విచక్షణ కలిగి ఉంటాడని ఆలయ ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు తెలిపారు.

ఈ రోజు కార్యక్రమాలకు శ్రీ గంగ్ర భూపాల్ రెడ్డి-రూపా దంపతులు, శ్రీ గంగ్ర అభిలాష్ రెడ్డి-దివ్య దంపతులు, శ్రీ గంగ్ర సాయికృష్ణారెడ్డి-భావనాంజలి దంపతులు, శ్రీ అనసూరి శ్రీనివాన్-బాలజనని దంపతులు, శ్రీ అట్టం శంతన్ పటేల్- శ్రీగంధ దంపతులు, శ్రీ ముప్పిడి సుధీర్ రెడ్డి- అర్పిత తదితరులు ఉభయదాతలుగా వ్యవహరించారు. పూజానంతరం ఉభయదాతలకు శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ప్రత్యేక క్యూలైన్లు, మంచినీటి సౌకర్యం మరియు మధ్యాహ్న భోజనం ఏర్పాట్లను ఆలయ ఈ.ఓ శ్రీమతి రామల సునీత పర్యవేక్షించారు. దేవాలయమును సందర్శించిన భక్తులందరికీ శ్రీ భద్రకాళీ సేవా నమితి కన్వీనర్ శ్రీ అయితా గోపీనాథ్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం, రాత్రి అశేష అన్నదానం నిర్వహించారు.

ఈ రోజు అమ్మవారిని తొగుట పీఠాధీశ్వరులు శ్రీ మాదవానంద నరస్వతీ స్వామివారి ఆలయాన్ని సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన స్వామివారికి ఆలయ ఈఓ శ్రీమతి రామల సునీత, ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజానంతరం ఆలయ మహామండపంలో భక్తులను ఉద్దేశ్యించి తమ అనుగ్రహ భాషణం తెలిపారు. అనంతరం దేవాలయములో తయారు చేయబడుచున్న నూతన రథమును పరిశీలించారు. సాయంకాలం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా హరికథ, భక్తి సంగీతం, కర్ణాటక సంగీతం మరియు కూచిపూడి నృత్యాలు భక్తులను ఎంతగానో అలరించాయి .

## కాశీబుగ్గ స్వధార్ హోమ్‌లో బాలికల హక్కులపై అవగాహన -- బతుకమ్మ వేడుకలు



హైదరాబాద్ పెన్ పవర్:

కాశీబుగ్గ, వరంగల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ , వరంగల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికాఎ దినోత్సవం సందర్భంగా కాశీబుగ్గలోని స్వధార్ హోమ్‌లో బాలికలు, మహిళల హక్కులు, రక్షణ, విద్య, ఆరోగ్యం, సమానత్వంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి. పూజ, లీగల్ ఎయిడ్ కౌన్సెల్ ఆర్. సురేష్, స్వధార్ హోమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా న్యాయమూర్తి కందుకూరి. పూజ మాట్లాడుతూ, బాలికలు, మహిళలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి అన్యాయం, వేధింపులు లేదా వివక్షకు గురైనప్పుడు ధైర్యంగా సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. బాలికల విద్య, భద్రత, స్వావలంబనకు ప్రాధాన్యత ఇవ్వాలని, బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి హోంలో ఆశ్రయం పొందుతున్న మహిళలతో మాట్లాడి, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని వివరించారు. అనంతరం స్వధార్ హోమ్‌లో బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను చాటుతూ, మహిళలు, హోమ్ సిబ్బంది కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. మహిళలు, బాలికల హక్కుల పరిరక్షణతో పాటు వారికి ఆత్మవిశ్వాసం, సామాజిక భద్రత కల్పించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు.

## దూలపల్లిలో గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డి.....

హైదరాబాద్ పెన్ పవర్:

దూలపల్లిలోని రామాలయం సమీపంలో దొడ్ల రాములమ్మ , దొడ్ల శ్రీనివాస్ నూతనంగా నిర్మించుకున్న గృహంలో నిర్వహించిన గృహప్రవేశ వేడుకకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఆత్మీయంగా పలకరించి, నూతన గృహప్రవేశ శుభాకాంక్షలు తెలియజేశారు. వారి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్



అధ్యక్షులు శివ కుమార్ గౌడ్, ఆదిరెడ్డి మోహన్ రెడ్డి, డప్పు నరేందర్, నాగరాజ్ యాదవ్, సాయి యాదవ్, రాజేష్ గౌడ్, చందర్ నాయక్, రాము యాదవ్, అలీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## శంభిపూర్ రాజు నూతన గృహ ప్రవేశ వేడుకలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన నాయకులు.....



హైదరాబాద్ పెన్ పవర్:

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్ పరిధిలోని శంభిపూర్‌లో మేడ్చల్ జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభిపూర్ రాజు నూతన గృహ ప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భౌరంపేట్‌కు చెందిన బి ఆర్ ఎస్ నాయకులు పాల్గొని శంభిపూర్ రాజు కి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నాగరాజు యాదవ్ , భౌరంపేట్ బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పోలీస్ గోవింద్ రెడ్డి , భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి , నాయకులు చింత వెంకట్ , గడిల బాబు, గడిల చింటూ తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ ట్రాఫిక్ పోలీస్ మైనర్ వాహనాలు నడిపే బాలల తల్లిదండ్రుల కు హెచ్చరిక

హైదరాబాద్ పెన్ పవర్: తేది 14/10/2026నాడు వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 08 మంది మైనర్ డ్రైవ్ చేసే వ్యక్తులను గుర్తించి వారిపై జువెనైల్ కోర్టులో చార్జెషీట్స్ ఫైల్ చేయగా అట్టి 08 మంది మైనర్ బాలురను గౌరవ జువెనైల్ మేజిస్ట్రేట్ గారు 01 రోజు బాలల అబ్జర్వేషన్ హోమ్ కి పంపనైనదిలి
ఇకపై వాహనాలు నడిపే మైనరర్లను పట్టుకొని ఛార్జ్ షీట్ ఫైల్ చేసి కోర్టు ముందు హాజరు పరచడం మరియు వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేయడం జరుగుతుంది అని తెలియపరుస్తున్నాం .లైసెన్సు లేకుండా వాహనాలు నడిపిన (3) మంది వాహనదారులకు వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీ అంకేశ్వరపు కమలాకర్ గారు 800/- రూపాయల జరిమాన విధించారు,
మరియు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 13 మందిని హాజరు పరుచగా,
వారికి 10,800/- రూపాయల జరిమానా విధించారు సర్,

## హనుమాన్ నగర్‌లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న పుప్పాల భాస్కర్.....



హైదరాబాద్ పెన్ పవర్:

దేవీ నవరాత్రులను పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం డివిజన్ పరిధిలోని హనుమాన్ నగర్‌లో గణేష్ ఏర్పాటు చేసిన అమ్మవారి మండపంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండప కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం పంపిణీ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కిరణ్ , డేవిడ్ , హనుమాన్ నగర్‌కు చెందిన ఆశా కుమార్ గౌడ్, నరసింహారెడ్డి, పడాల గణేష్, అవినాష్ రెడ్డి, సిమ్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# మెట్రో ఫేజ్-2 పనుల్లో వేగం

**హైదరాబాద్ అక్టోబరు 14 పెన్ పవర్:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణ పనులు వేగం పుంజుకుంటున్నాయి. ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా, నిర్మాణ పనులను పర్యవేక్షించేందుకు అత్యంత ముఖ్యమైన జనరల్ కన్సల్టెన్సీ (జీసీ)ల నియామక ప్రక్రియపై అధికారులు దృష్టి సారించారు. మొత్తం ఏడు కారిడార్లలో తొలి దశలో నాలుగు కీలక మార్గాలకు జీసీలను ఎంపిక చేసేందుకు చర్యలు చేపట్టారు.మొత్తం రూ.38,595 కోట్ల అంచనా వ్యయంతో 122.9 కిలోమీటర్ల మేర మెట్రో ఫేజ్-2 విస్తరణ పనులు జరగనున్నాయి. ఇందులో భాగంగా రాయదుర్గం-కోకాపేట (11.6 కి.మీ.), ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ.), ఎల్బీనగర్-హయత్?నగర్ (7.1 కి.మీ.), మియాపూర్-పటాన్‌చెరు (13.4 కి.మీ.) కారిడార్ల పనుల పర్యవేక్షణ కోసం రెండు నెలల క్రితం టెండర్లు పిలిచారు. అయితే, ఆశించిన స్థాయిలో కంపెనీలు ముందుకు రాకపోవడంతో టెండర్ల గడువును ఈ నెల 22 వరకు పొడిగించారు. ఈ నాలుగు కారిడార్లకు జీసీల నియామకం పూర్తయితే పనుల్లో గణనీయమైన పురోగతి సాధించవచ్చని అధికారులు భావిస్తున్నారు.నిర్మాణ పనుల్లో జీసీల పాత్ర అత్యంత కీలకం. ప్రాజెక్టు డిజైన్ల రూపకల్పన, పనుల నాణ్యత పర్యవేక్షణ, కాంట్రాక్టర్లు, ఇతర సంస్థలతో సమన్వయం చేయడం వీరి ప్రధాన బాధ్యత. నిర్మాణ సమయంలో తలెత్తే సాంకేతిక సమస్యలకు పరిష్కారాలు సూచిస్తూ, ప్రాజెక్టు పురోగతిని ఎప్పటికప్పుడు హెచ్ఎంఆర్ఎల్‌కు నివేదించాల్సి ఉంటుంది. జీసీల ఎంపికను 'క్వాలిటీ కమ్ కాస్ట్ బేస్డ్ సెలక్షన్' (క్యూసీబీఎస్) పద్ధతిలో చేపట్టనున్నారు. అంటే, సంస్థల గత పనితీరు, సాంకేతిక సామర్థ్యం, నాణ్యతతో పాటు వారు కోట్ చేసిన వ్యయాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా ఎంపిక చేస్తారు.మరోవైపు, ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పాతబస్తీ మెట్రో కారిడార్ (ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట) పనుల్లో ప్రధాన అడ్డంకి అయిన భూసేకరణ దాదాపుగా కొలిక్కి వచ్చింది. గతంలో అలైన్‌మెంట్‌లో మార్పుల కారణంగా అవసరమైన ఆస్తుల సంఖ్యను 1,400 నుంచి 888కి తగ్గించారు. ఇప్పటివరకు ఇందులో 833 ఆస్తులను సేకరించగా, మిగిలిన 55 ఆస్తుల సేకరణను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేసేందుకు అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మార్గంలో పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యమిస్తున్నారు. తొలగించిన ప్రతీ చెట్టుకు బదులుగా వేరే ప్రాంతంలో ఆరు మొక్కలు నాటాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

# వ్యక్తిగత శత్రువులు ..రాజకీయాల్లో ప్రత్యర్థులు

**హైదరాబాద్ అక్టోబరు 14 పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో రోజురోజుకూ ప్రజా సమస్యల ప్రాతిపదికన జరగాల్సిన చర్చలు కనుమరుగవుతూ, వ్యక్తిగత దూషణలు, వ్యక్తిత్వ హనన డిజిటల్ దాడులే ప్రధాన ఎజెండాగా మారుతున్నాయి. ప్రజాస్వామ్యంలో అధికార, ప్రతిపక్షాల మధ్య సిద్ధాంతపరమైన విభేదాలు, ప్రజా విధానాలపై ఆరోగ్యకరమైన విమర్శలు ఉండటం సహజం. అయితే, ప్రస్తుత తెలంగాణ రాజకీయ వాతావరణం ప్రజా సమస్యలను పక్కనపెట్టి, నాయకుల వ్యక్తిగత జీవితాలు, ఆరోగ్యం, కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని సాగిస్తున్న క్యారెక్టర్ అస్సాసినేషన్ సంస్కృతికి అద్దం పడుతోంది.బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనకు అస్వస్థత, జ్వరం కారణంగా రెండు రోజుల పాటు విశ్రాంతి తీసుకుంటున్నట్లు, అందుబాటులో ఉండటం లేదని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. అయితే, ఒక నాయకుడి అనారోగ్యంపై సానుభూతి ప్రదర్శించాల్సింది పోయి, ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులు, సోషల్ మీడియా విభాగం నేతలు దాని వెనుక ఏదో రహస్య కారణం ఉందంటూ కథనాలు అల్లడం మొదలుపెట్టారు. దర్యాప్తు సంస్థల భయం వల్లే ఆయన అనారోగ్యం డ్రామా ఆడుతున్నారంటూ రకరకాల ఊహాగానాలతో ప్రచారం చేయడం రాజకీయ నైతికత ఏ స్థాయికి దిగజారిందో చాటిచెప్పింది.అదే సమయంలో, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని బిఆర్ఎస్ సానుభూతిపరులు, కాంగ్రెస్ వ్యతిరేకులు డిజిటల్ హ్యాండిల్స్ సాగిస్తున్న ప్రచారం కూడా హద్దులు దాటుతోంది. సీఎం హోదాలో ఉన్న వ్యక్తి వ్యక్తిగత జీవితంపై అసభ్యకరమైన పోస్టులు పెట్టడం, మార్ఫింగ్ ఇమేజ్‌లు, వికృతమైన కంటెంట్‌ను వ్యాప్తి చేయడం పరిపాటిగా మారింది. ముఖ్యమంత్రి, ఆయన కుటుంబ సభ్యులపై సామాజిక మాధ్యమాల్లో జుగుప్సాకర వ్యాఖ్యలు చేశారంటూ ఇప్పటికే సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్లలో పలు కేసులు సైతం నమోదయ్యాయి. న్యాయపరమైన చర్యలు హెచ్చరిస్తున్నప్పటికీ, డిజిటల్ వేదికలపై వైరం ఏమాత్రం తగ్గడం లేదు.ఈ రకమైన డిజిటల్ యుద్ధానికి ప్రధాన కారణం ఇరు పార్టీల సోషల్ మీడియా ఆర్మీలు నిర్వహిస్తున్న శైలేనని భావిస్తున్నారు. యూట్యూబ్ ఛానెళ్లు, ఎక్స్ , ఫేస్‌బుక్ , వాట్సాప్ గ్రూపుల ద్వారా కంటెంట్‌ను వైరల్ చేసే క్రమంలో లైకులు, వ్యూస్, రాజకీయాధిపత్యం కోసం ప్రత్యర్థులపై అత్యంత నీచమైన పదజాలాన్ని ఉపయోగిస్తున్నారు. పాలనాపరమైన లోపాలు, విద్యుత్ సంక్షోభం, నిరుద్యోగం, ధరణి లేదా హైడ్రా వంటి ప్రజా సమస్యలపై చర్చించాల్సిన చోట, నాయకుల వ్యక్తిగత బలహీనతలు లేదా వ్యక్తిగత జీవితాలే డిజిటల్ వేదికల్లో ప్రధాన అంశాలుగా మారుతున్నాయి. తెలంగాణ సమాజం చైతన్యవంతమైన రాజకీయ పోరాటాలకు నిలయం. ఉమ్మడి రాష్ట్రంలో హుందాగా సాగిన సిద్ధాంత రాద్ధాంతాలు, హక్కుల పోరాటాల స్థానంలో ఇప్పుడు క్షుద్ర రాజకీయాలు చోటుచేసుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థకే చేటు తెస్తోంది. నాయకుల మధ్య శత్రుత్వం కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా వ్యక్తిగత కక్ష సాధింపుగా రూపాంతరం చెందుతుండటంతో, ద్వితీయ శ్రేణి కార్యకర్తలు కూడా క్షేత్రస్థాయిలో పరస్పరం దాడులకు తెగబడే వాతావరణం ఏర్పడుతోంది. ఈ ధోరణికి తక్షణమే అడ్డుకట్ట పడకపోతే, ప్రజా సమస్యలు గాలికి కొట్టుకుపోయి కేవలం బురదజల్లుడు రాజకీయాలే రాజ్యమేలుతాయి. ఏ పార్టీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా.. తమ పార్టీ సోషల్ మీడియా విభాగాలను అదుపులో ఉంచుకోవాల్సిన ప్రాథమిక బాధ్యత అగ్రనాయకత్వానిదే. వ్యక్తిగత దూషణలను, వికృతమైన డిజిటల్ పోస్టులను ఖండిస్తూ సీనియర్ నేతలు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసినప్పుడే తెలంగాణ రాజకీయాల్లో పోగొట్టుకున్న హుందాతనాన్ని మళ్లీ పునరుద్ధరించడం సాధ్యమవుతుందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

# మూడేళ్ల- వేల కోట్ల రూపాయల టర్నోవర్

**హైదరాబాద్ అక్టోబరు 14 పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో, పరిపాలనా యంత్రాంగంలో అత్యంత కీలకమైన రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబానికి చెందిన రాఘవ ప్రాజెక్ట్స్ వ్యాపార దూకుడు ఇప్పుడు హైదరాబాద్ రియల్ ఎస్టేట్ వర్గాల్లో హాట్ టాపిక్ అవుతోంది. 1991లో ప్రారంభమైన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ దశాబ్దాల పాటు కేవలం ప్రభుత్వ సాగునీటి ప్రాజెక్టులు, రోడ్లు, బ్రిడ్జిలు, జాతీయ రహదారుల కాంట్రాక్టులకే పరిమితమైన సంస్థ. అలాంటి సంస్థ అకస్మాత్తుగా హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో అత్యంత ఖరీదైన గగనతల నిర్మాణాలను శాసించే స్థాయికి ఎదగింది. ఇది సాధారణ వ్యాపార వృద్ధిగా ఎవరూ చూడలేకపోతున్నారు. మూడేళ్ల కిందట రియల్ ఎస్టేట్ మార్కెట్లో ఒక చిన్నపాటి ఉనికి మాత్రమే ఉన్న కుటుంబ వ్యాపారం.. నేడు ఏకంగా వేల కోట్ల రూపాయల టర్నోవర్‌తో మెగా ప్రాజెక్టులను ఒకదాని వెంట ఒకటి ఎలా ప్రారంభిస్తోందన్న ప్రశ్నలు ఇప్పుడు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.సరిగ్గా మూడేళ్ల వెనక్కి వెళ్లి చూస్తే.. 2022-23 నాటికి హైదరాబాద్ ప్రైమ్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో రాఘవ సంస్థ పేరు కేవలం ఇతర బిల్డర్లతో చిన్నపాటి జాయింట్ వెంచర్లలో తప్ప స్వతంత్రంగా ఎక్కడా పెద్దగా వినిపించలేదు. రాయదుర్గం సమీపంలో మొదలుపెట్టిన ఐరిస్ బై రాఘవ స్కై-విల్లా ప్రాజెక్ట్ ఒక్కటే వారి ఖాతాలో ఉన్న ఏకైక హై-ఎండ్ ప్రాజెక్ట్. కానీ, గత రెండున్నర మూడేళ్ల వ్యవధిలో.. మరీ ముఖ్యంగా రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు మారి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వంలో చక్రం తిప్పే స్థాయికి చేరిన తర్వాత ఈ రియల్ ఎస్టేట్ గ్రాఫ్ రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. ఆయన కుమారుడు హర్ష రెడ్డి, సోదరుడు ప్రసాద్ రెడ్డి సారథ్యంలో నడుస్తున్న సంస్థ.. అకస్మాత్తుగా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట్, తెల్లాపూర్, కొల్లూరు వంటి అల్ట్రా-లగ్జరీ హబ్‌లలో ఏకధాటిగా అరడజనుకు పైగా మెగా ప్రాజెక్టులను మార్కెట్లోకి వదలింఈ స్వల్ప వ్యవధిలోనే తెల్లాపూర్‌లో 8.2 ఎకరాల్లో 36 అంతస్తుల వేవ్ , కొల్లూరులో కోట్ల రూపాయల విలువైన లగ్జరీ విల్లా ప్రాజెక్ట్ సేజ్ , నానక్‌రామ్‌గూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో 60 అంతస్తులకు పైగా ప్లాన్ చేసిన భారీ టవర్ల సింక్, అదే ప్రాంతంలో 63 అంతస్తుల ట్విన్ టవర్ల నోవా , కోకాపేట్ ప్రైమ్ జోన్‌లో 9.4 ఎకరాల్లో 58 అంతస్తుల నాలుగు స్కైస్క్రాపర్లతో కూడిన లింక్ వంటి భారీ వెంచర్లు వరుసకట్టాయి. హైదరాబాద్‌లోనే అత్యంత ఖరీదైన ప్రాంతాలుగా పేరుగాంచిన కోకాపేట్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లలో ఒక్కో ఎకరం ధర వంద కోట్ల రూపాయలకు పైగా పలుకుతుంటే.. పదుల కొద్దీ ఎకరాల భూములను సమీకరించేందుకు వేల కోట్ల మూలధనం ఎక్కడి నుంచి వచ్చిందన్నది ఎవరికీ అంతుచిక్కని ప్రశ్న. దశాబ్దాలుగా రియల్ ఎస్టేట్ రంగంలో పాతుకుపోయిన దిగ్గజ డెవలపర్లు సైతం ఒక్కో మెగా ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించడానికి ఆచితూచి అడుగులు వేస్తుంటే.. రాఘవ గ్రూప్ మాత్రం ఏకంగా 60 అంతస్తుల ఆకాశహర్మ్యాలను లెక్కలేనన్ని నిర్మించే స్థాయికి ఎలా చేరింది? అన్నది సగటు ప్రజలకు వచ్చే సందేహం.

అంతేకాకుండా, అంతస్తుల అనుమతులు, కాలుష్య నియంత్రణ మండలి క్లియరెన్సులు, రెరా ఆమోదాలు, మున్సిపల్ శాఖ నుంచి 60 అంతస్తుల ఎత్తుకు సంబంధించిన ప్రత్యేక జివోలు ఇంత శరవేగంగా ఎలా మంజూరవుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వంలో ఉన్నత హోదా, భూములు-లేఅవుట్లను నియంత్రించే రెవెన్యూ, మున్సిపల్ అధికార యంత్రాంగంపై ఉన్న పట్టు వల్లే ఈ అనుమతులు క్షణాల్లో దూసుకుపోతున్నాయా అన్న అనుమానాలు కూడా ఉన్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో క్లియరెన్సుల కోసం సాధారణ బిల్డర్లు ఏళ్ల తరబడి కాళ్లరిగేలా తిరగాల్సిన పరిస్థితులు ఉన్న వేళ.. కేవలం ఒకే ఒక్క గ్రూప్‌కు చెందిన భారీ ప్రాజెక్టులకు మాత్రం రెడ్ కార్పెట్ ఎలా పరుస్తున్నారన్న దానికి సమాధానం అందరికీ తెలిసే ఉంటుంది.

# శ్రీ రక్ష హాస్పిటల్‌లో న్యూరో సర్జరీ సేవలకు శ్రీకారం

ఖమ్మం ప్రజలకు మరింత చేరువలో మెరుగైన వైద్య సేవలు

**మెదడు, వెన్నెముక సమస్యలతో బాధపడే రోగులకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తీసుకురావడమే మా లక్ష్యం.. ప్రజల ఆరోగ్యమే మా ప్రథమ ప్రాధాన్యం. అని శ్రీ రక్ష హాస్పిటల్ యాజమాన్యం పేర్కొంది.**



**ఖమ్మం, పెన్ పవర్, అక్టోబర్ 14 :**
ఖమ్మం నగర ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలను చేరువ చేసే దిశగా నెహ్రూ నగర్‌లోని శ్రీ రక్ష హాస్పిటల్ మరో కీలక ముందడుగు వేసింది. మెదడు, వెన్నెముకకు సంబంధించిన అనారోగ్య సమస్యలకు ప్రత్యేక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చే క్రమంలో ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ నాగేంద్ర కుమార్ ఆసుపత్రిని సందర్శించారు.

ఈ సందర్భంగా శ్రీ రక్ష హాస్పిటల్ అధినేత, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్, బీజేపీ తెలంగాణ కార్యవర్గ సభ్యులు గోంగూర వెంకటేశ్వర్లు (డాక్టర్ జి.వి.) డాక్టర్ నాగేంద్ర కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. న్యూరో సర్జరీ సేవల ద్వారా ఖమ్మం ప్రాంత ప్రజలకు మరింత మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి రానుండటంపై హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ షేక్ ఏడుకొండలు, జనరల్ సర్జరీ వైద్యులు డాక్టర్ కాశీ విశ్వనాథ్, ఆసుపత్రి ఫైనాన్స్ విభాగానికి చెందిన చంద్రకళతో పాటు ఆసుపత్రి సిబ్బంది పాల్గొని డాక్టర్ నాగేంద్ర కుమార్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు మెరుగైన న్యూరో సర్జరీ వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో శ్రీ రక్ష హాస్పిటల్‌లో సేవలు అందించనున్నట్లు తెలిపారు. మెదడు, వెన్నెముకకు సంబంధించిన సమస్యలతో బాధపడుతున్న రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

**ఖమ్మం ప్రజలకు మరింత చేరువలో ప్రత్యేక వైద్యం**

సాధారణంగా న్యూరో సర్జరీ వైద్యం కోసం ఇతర నగరాలకు వెళ్లాల్సిన అవసరం ఏర్పడే రోగులకు స్థానికంగా ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులోకి రావడం ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది. ఖమ్మం జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో శ్రీ రక్ష హాస్పిటల్ తన వైద్య సేవలను విస్తరిస్తోంది.
ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడం మా బాధ్యత
ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే మా ఆశయం.
అనే సంకల్పంతో శ్రీ రక్ష హాస్పిటల్ ముందుకు సాగుతోంది

# సోషల్ మీడియా ఫేమ్ కోసం పెద్దవారితో వెకిలి చేష్టలా?

రీల్స్ పేరుతో వృద్ధుల ఆత్మగౌరవానికి భంగం.. యువతలో పెరుగుతున్న అనుచిత ధోరణులపై ప్రత్యేక దృష్టి అవసరం!







**ఖమ్మం,పెన్ పవర్, అక్టోబర్ 14:** సోషల్ మీడియాలో పాపులారిటీ సంపాదించాలనే తాపత్రయం కొందరు యువతను తప్పుదారి పట్టిస్తోందా? ఇన్‌స్టాగ్రామ్‌లో లైకులు, వ్యూస్, ఫాలోవర్ల కోసం కొందరు చేస్తున్న రీల్స్ సామాజిక విలువలను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ముఖ్యంగా వయసు పైబడిన వారిని లక్ష్యంగా చేసుకుని, వారితో వెకిలి చేష్టలు చేస్తూ, వారిని ఇబ్బందులకు గురిచేసేలా వీడియోలు రూపొందించి సోషల్ మీడియాలో ప్రచారం చేయడం ఆందోళన కలిగించే అంశం.

**తల్లిదండ్రుల వయసున్న వారితో ఇలాంటి ప్రవర్తనా?**

మనకంటే వయసులో పెద్దవారైన వారు మన తల్లిదండ్రులతో సమానం. వారు మన సమాజానికి అనుభవ సంపద. వారి జీవితంలో ఎన్నో కష్టాలు, అనుభవాలు, త్యాగాలు ఉంటాయి. అలాంటి వారిని గౌరవించడం మన సంస్కృతి నేర్పిన విలువ. కానీ కొందరు మాత్రం ఇదే విషయాన్ని మరిచి, వృద్ధులను ఆటపట్టిస్తూ, వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వీడియోలు తీసి వినోదంగా చూపిస్తున్నారు. వీడియోలో కనిపించే వ్యక్తి ఇబ్బందిపడుతున్నాడా? అతని ఆత్మగౌరవానికి భంగం కలుగుతోందా? అనే కనీస ఆలోచన లేకుండా వ్యవహరించడం బాధాకరం.

**ఫేమస్ కావాలంటే ఇదే మార్గమా?**

సోషల్ మీడియాలో గుర్తింపు పొందడం తప్పు కాదు. హాస్యం పంచడం కూడా తప్పు కాదు. అయితే ఆ హాస్యం ఎదుటివారిని అవమానించేలా ఉండకూడదు. ఒక వ్యక్తి సమ్మతి లేకుండా వీడియో తీసి ప్రచారం చేయడం, అతని బలహీనతలను ఎగతాళి చేయడం, వ్యక్తిగత గౌరవాన్ని దెబ్బతీసేలా రీల్స్ చేయడం సరైన పద్ధతి కాదు. ముఖ్యంగా వృద్ధులు తమ వీడియోలు ఎలా ఉపయోగిస్తారో పూర్తిగా అర్థం చేసుకోలేని పరిస్థితుల్లో వారిని మరింత జాగ్రత్తగా చూడాల్సిన బాధ్యత యువతపై ఉంది.

**యువతకు ఇదేనా ఆదర్శం?**

నేటి యువత చేతిలో స్మార్ట్‌ఫోన్ ఒక శక్తివంతమైన సాధనం. దానితో మంచి సందేశాలు ఇవ్వవచ్చు. పేదలకు సహాయం చేయవచ్చు. వృద్ధుల కష్టాలను సమాజానికి తెలియజేయవచ్చు. ప్రతిభను వెలుగులోకి తీసుకురావచ్చు. కానీ కొద్దిసేపటి వినోదం కోసం పెద్దవారిని ఇబ్బందిపెట్టే వీడియోలను ప్రచారం చేస్తే, వాటిని చూసే మరికొందరు కూడా అదే ప్రవర్తనను అనుకరించే ప్రమాదం ఉంది. అందుకే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సామాజిక సంస్థలు యువతకు డిజిటల్ బాధ్యతపై అవగాహన కల్పించాలి.

**సోషల్ మీడియా వేదికలూ బాధ్యత వహించాలి!**

వృద్ధులను అవమానించేలా, వేధించేలా ఉన్న వీడియోలపై సంబంధిత వేదికలకు ఫిర్యాదు చేయాలి. బాధితుల అనుమతి లేకుండా వ్యక్తిగత వీడియోలను ప్రచారం చేయకుండా జాగ్రత్తపడాలి. వీడియోలో పాల్గొన్న వ్యక్తుల సమ్మతి, గౌరవం, గోప్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి. వేధింపులు లేదా అవమానకర ప్రవర్తన చోటుచేసుకున్న సందర్భాల్లో పరిస్థితిని బట్టి సంబంధిత అధికారులను ఆశ్రయించవచ్చు.

**సమాజం ఆలోచించాల్సిన ప్రశ్న!**

మన ఇంట్లోని తల్లిదండ్రులను, తాతయ్యలను, అమ్మమ్మలను ఎవరైనా ఇలా ఎగతాళి చేస్తే మనం అంగీకరిస్తామా? అంగీకరించనప్పుడు ఇతరుల తల్లిదండ్రుల వయసున్న వారితో అలాంటి ప్రవర్తన ఎందుకు?

రీల్స్ కొన్ని క్షణాల వినోదాన్ని ఇవ్వవచ్చు. కానీ ఒక మనిషి మనసుకు కలిగిన బాధ చాలా కాలం మిగిలిపోవచ్చు. ఫాలోవర్లు పెరగడం కంటే మానవత్వం పెరగడం ముఖ్యం. లైకులు సంపాదించడం కంటే పెద్దల ఆశీర్వాదాలు సంపాదించడం గొప్ప విషయం.యువత గుర్తుంచుకోవాల్సిన విషయం ఒక్కటే ఫేమ్ కోసం మనిషి గౌరవాన్ని పణంగా పెట్టకండి. వృద్ధులను గౌరవించండి, వారి ఆత్మగౌరవాన్ని కాపాడండి. సోషల్ మీడియాను వినోదానికి మాత్రమే కాకుండా సమాజంలో మంచి మార్పు తీసుకురావడానికి ఉపయోగించండి.

# సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు సంగిశెట్టి యశోదమ్మకు ఘన నివాళులు





- **కాంగ్రెస్ పార్టీకి యశోదమ్మ సేవలు చిరస్మరణీయం**
- **పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన తుంబురు దయాకర్ రెడ్డి**

**ఖమ్మం, పెన్ పవర్, అక్టోబర్ 14:** కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేసిన సీనియర్ నాయకురాలు సంగిశెట్టి యశోదమ్మ మృతి పార్టీ శ్రేణులను విషాదంలో ముంచింది. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని జలగంనగర్‌కు చెందిన యశోదమ్మ (68) మృతి విషయం తెలుసుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబురు దయాకర్ రెడ్డి ఆమె నివాసానికి చేరుకుని పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ సందర్భంగా తుంబురు దయాకర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా జీవితంలో సేవాభావంతో పనిచేసే నాయకులు సమాజంపై చెరగని ముద్ర వేస్తారని పేర్కొన్నారు. సంగిశెట్టి యశోదమ్మ కాంగ్రెస్ పార్టీ పట్ల చూపిన నిబద్ధత, పార్టీ కోసం చేసిన సేవలు గుర్తుండిపోతాయని అన్నారు. ఆమె మరణం కుటుంబ సభ్యులకే కాకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలకు కూడా తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.యశోదమ్మ కుటుంబ సభ్యులను ఓదార్చిన నాయకులు, ఆమెతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడి వాతావరణం విషాదభరితంగా మారింది. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని పలువురు నాయకులు ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాడ దుర్గా ప్రసాద్, ఏదులాపురం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బానోత్ కిషోర్ నాయక్, కౌన్సిలర్లు బోయిన కుమారి, సంగయ్య, బానోత్ దివ్య, పుల్చంద్, కాంగ్రెస్ నాయకులు ధరావత్ రామ్మూర్తి నాయక్ వెంకటనారాయణ, బోయిన సాయి తదితరులు పాల్గొని యశోదమ్మకు నివాళులర్పించారు.

# ట్వీట్లతో పోటీ... లెక్క తేల్చేస్తున్న పెద్దలు

**విజయవాడ అక్టోబరు 14 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో అధికార ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు , పవన్ కల్యాణ్ పరిపాలనాపరంగా ఎలాంటి విభేదాలు లేకపోయినా.. క్షేత్రస్థాయిని శాసించే సోషల్ మీడియా వేదికలపై మాత్రం నిత్యం అగ్గిరాజేస్తూనే ఉంది. ఇరు పార్టీల అధినేతలు భేటీ అవుతూ సమన్వయంతో ప్రభుత్వాన్ని నడిపిస్తున్నప్పటికీ, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో రెండు పార్టీల కార్యకర్తలు, సానుభూతిపరులు పరస్పరం చేసుకుంటున్న విమర్శలు తారాస్థాయికి చేరుతున్నాయి.పవన్ కల్యాణ్ ఏదైనా వ్యాఖ్య చేసిన తర్వాత టీడీపీ సోషల్ మీడియా విభాగాలు భావోద్వేగాలతో రియాక్ట్ కావడం, దానికి ప్రతిగా జనసేన సైనికులు గత త్యాగాలనుగుర్తుచేస్తూ విరుచుకుపడటం పరిపాటిగా మారింది. అటు కాకినాడ, పిఠాపురం నుంచి మొదలుకొని విశాఖ పెందుర్తి వంటి చోట్ల వరకు ఫ్లెక్సీల వివాదాలు, స్థానిక ఆధిపత్య పోరును సోషల్ మీడియా వేదికలకు ఎక్కించి ట్రోలింగ్ వార్ నడుపుతున్నారు. నాయకత్వం చెప్పే విధానపరమైన ప్రకటనల కంటే.. యూట్యూబ్ తంబ్‌నెయిల్స్, సోషల్ మీడియా రీల్స్‌లోని కట్ క్లిప్పింగులకే కార్యకర్తలుప్రాధాన్యతనిస్తూ ఒకరినొకరు కించపరుచుకునే స్థాయికి దిగజారుతున్నారు.ఇదే సమయంలో రాబోయే స్థానిక సంస్థల సమరానికి సంబంధించి సీట్ల పంపకాల లెక్కలను పార్టీ పెద్దల కంటే ముందే ఈ కీబోర్డ్ వారియర్స్ తేల్చేస్తుండటం మరింత హాస్యాస్పదంగా మారింది. 17 కార్పొరేషన్లు, 106 మున్సిపాలిటీల రిజర్వేషన్లు ఖరారైన వేళ.. ఏ సీటు తమకే దక్కాలి, ఎవరు ఎక్కడ త్యాగం చేయాలనే దానిపై సోషల్‌మీడియాలోనే ఎవరికి వారే జాబితాలు విడుదల చేసుకుంటున్నారు. విజయవాడ, విశాఖ, కాకినాడ మేయర్ సీట్లతో పాటు కీలక మున్సిపాలిటీలను జనసేనకే ఇవ్వాలని కొందరు, టీడీపీ సంప్రదాయ ఓటుబ్యాంకు ప్రకారం మెజారిటీ స్థానాలు తమకే ఉండాలని మరికొందరు సొంత సిద్ధాంతాలు వండి వారుస్తున్నారు. పెద్దలు కూర్చుని ఒక ఒప్పందానికి వస్తారన్న కనీస ఇంగితం లేకుండా.. ఎవరికి ఎన్ని సీట్లుకేటాయించాలన్న దానిపై వీరే లెక్కలు కడుతూ కూటమి మైత్రిని విషమించేలా చేస్తున్నారు. ఈ తరహా వర్గపోరు అంతిమంగా ప్రతిపక్షానికి రాజకీయ అస్త్రంగా మారుతుందన్న స్పృహ కేడర్‌లో లోపిస్తోంది.పార్టీల అధిష్ఠానాలు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా, ఫేక్ అకౌంట్ల ప్రచారాలను నమ్మవద్దని హెచ్చరించినా.. సోషల్ మీడియాలో ముఠా కక్షల తరహాలో సాగుతున్న ఈ డిజిటల్ వార్ ఆగడం లేదు. ఒకవైపునాయకులు ఐక్యతను ప్రదర్శిస్తుంటే, మరోవైపు కార్యకర్తలు ఇలా కయ్యానికి కాలుదువ్వడం కూటమి క్షేత్రస్థాయి ఓటు బదిలీపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదముంది.

# మనమిత్ర ద్వారా కుల ధృవీకరణ పత్రాలు..

## మొబైల్ ద్వారానే డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం

**విజయవాడ అక్టోబరు 14 పెన్ పవర్:** ఏపీ ప్రభుత్వం చాలా పనులను ఆన్‌లైన్ ద్వారా చేసుకునే వెసలుబాటు కల్పించింది. తాజాగా మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా తమ కుల ధృవీకరణ పత్రాలు పొందే సదుపాయాన్ని కల్పించినట్లురియల్ టైమ్ గవర్నెన్స్ అధికారులు తెలిపారు. పౌరులు తమ కుల ధృవీకరణ పత్రాలలు కావాల్సినప్పుడు ఏ ప్రభుత్వ ఆఫీసులకు వెళ్లనవసరం లేదు. తాము ఉన్న చోటు నుంచే తమ మొబైల్‌ఫోన్ ద్వారాడౌన్‌లోడు చేసుకోవచ్చని ఆర్టీజీఎస్ రాష్ట్ర ప్రజలకు సూచించింది. మనమిత్రలోని రెవెన్యూ సేవల విభాగంలో పౌరులు రీ ఇష్యూయెన్స్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్స్ సెక్షన్ ఎంపిక చేసుకోవాలి. అందులో తమ ఆధార్ నంబరు ఎంటర్ చేసి, దాంతో ఓటీపీ పొందాలి. ఈ ఓటీపి అందులో నమోదు చేసిన తర్వాత కొన్ని వివరాలను మీరు ఫిల్ చేయాలి. తర్వాత మీరు క్యాస్ట్ సర్టిఫికెట్ పొందడానికి కావాల్సిన 40రూపాయలు రుసుమును వాట్సాప్ గవర్నెన్స్ ద్వారానే చెల్లించాలి. ఒకసారి చెల్లింపు అయిన తర్వాత వాట్సాప్‌లో మీ కుల ధృవీకరణ పత్రం డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇప్పటికే కులానికి సంబంధించినపత్రాలు జారీ అయిన వారు తమ సర్టిఫికెట్లను వాట్సాప్ ద్వారా తమకు కావాల్సిన సమయంలో కావాల్సినప్పుడు డౌన్లోడు చేసుకోవచ్చు. ప్రతిసారి కుల ధృవీకరణ పత్రాల కోసం రెవెన్యూ ఆఫీసులు, స్వర్ణగ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాలు, మీ సేవా కేంద్రాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఈ సదుపాయం ఇప్పటికే క్యాస్ట్ సర్టిఫికెట్ పొందినవారికి కల్పిస్తున్నామని..త్వరలో మనమిత్ర ద్వారా కొత్తగా కుల ధృవీకరణకు అప్లై చేసుకుని పొందే సదుపాయం కూడా కల్పించనున్నట్లు ఆర్టీజీఎస్ ఓ ప్రకటనలో తెలిపింది. మీరు ఏపీ పౌరుడు అయితే మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ నంబరు 9552300009 కు ఎఱ (హాయ్) అని మెసేజ్ పంపాలి మీకు కావాల్సిన సర్వీసును ఎంచుకోవడం ఆప్షన్ పైన క్లిక్ చేయండి ఆ తరువాత రెవెన్యూ సేవల ఆప్షన్ ఎంపిక చేసుకోవాలిరీ-ఇష్యూయెన్స్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు ఆప్షన్ మీరు సెలక్ట్ చేసుకోవాలి మీ ఆధార్ నంబర్ ఎంటర్ చేయాలి. మీ మొబైల్ కు ఓటీపీ వస్తుంది.మీ రిజిస్టర్ అయిన మొబైల్‌కు వచ్చిన ఓటీపీనిఅడిగిన చోట టైపు చేయాలి ఆధార్ డెమోగ్రాఫిక్స్ రివ్యూలో అడిగిన వివరాలన్నీ నమోదు చేయాలి కుల ధృవీకరణ పత్రం పొందడానికి రూ.40 చెల్లించాలి ఈ నగదు చెల్లించడానికి ఉన్న పేమెంట్ గేట్ వేద్వారా మాత్రమే మీరు చెల్లించాలి: మీ కుల ధృవీకరణ పత్రం పీడీఎఫ్ డౌన్ లోడ్ అని వస్తుంది: మీ ఝురవ జవతీఅటఅఝ్వ మీరు ప్రింట్ ఔట్ తీసుకోవచ్చు లేదా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

# దిగుమతి రాజకీయం.. జనసేన నయా ట్రెండ్!




**విజయవాడ అక్టోబరు 14 పెన్ పవర్:** రాజకీయాల్లో కుప్పిగెంతులు ఉంటాయి. ఆ పార్టీ నుంచి ఈ పార్టీకి.. ఈ పార్టీ నుంచి ఆ పార్టీ నాయకులు మారడం అత్యంత సహజం. ముఖ్యంగా విపక్షంలో ఉన్న నేతలు అధికారంపై మోజుతో రూలింగ్ పార్టీల్లో చేరడం చాలా ఎక్కువగా జరుగుతుంటుంది. కానీ, ఏపీలో ఈ తరహా రాజకీయాలకు భిన్నమైన విధంగా దిగుమతి రాజకీయం నడుస్తోందని అంటున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూటమిగా ఏర్పడిన టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు తమకు అవసరమైన నాయకులను ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి దిగుమతి చేసుకోవడమే ఈ ట్రెండ్ అంటున్నారు. ఇందుకు తాజా ఉదాహరణగా తాజాగా జనసేన కండువా కప్పుకున్న మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ ఉదంతాన్ని సూచిస్తున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమక్షంలో మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ జనసేనలో చేరడంతో ఈ చర్చ మరింత ఎక్కువ అయింది. గత కొన్నిరోజులుగా రాధాకృష్ణ జనసేనలో చేరతారని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అయితే ఆయన ప్రస్తుతం ఉన్న టీడీపీలో అసంతృప్తి లేదా అసౌకర్యం కారణంగా పార్టీ మారకపోవడమే ఇక్కడి విశేషంగా చెబుతున్నారు. రాజకీయ అవసరాల రీత్యా టీడీపీ నుంచి రాధాకృష్ణను జనసేనను దిగుమతి చేసుకుందని పొలిటికల్ ఎనలిస్టులు చమత్కరిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల నుంచి కొనసాగుతున్న ఈ ట్రెండ్ ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో మరింత ఎక్కువయ్యే అవకాశం ఉందని అంటున్నారు.

విజయవాడ మేయర్ పదవిని ఆశిస్తున్న జనసేన తమ పార్టీలో సమర్థుడైన నేత లేరన్న కారణంతో టీడీపీ నుంచి రాధాకృష్ణను తమ పార్టీలోకి తెచ్చుకుందని చెబుతున్నారు. దీనిద్వారా కూటమి పార్టీలు మూడు తమకు అవసరమైన చోట అవసరమైన అభ్యర్థుల కోసం అభ్యర్థులను బదిలీ చేసుకునే కొత్త సంస్కృతి తీసుకువచ్చాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సమయం లేకపోవడం వల్ల ఈ పద్ధతి అనుసరించారని భావించినప్పటికీ, అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్ల తర్వాత కూడా అదే విధానాన్ని అనుసరించడమే ఆశ్చర్యానికి గురిచేస్తోందని అంటున్నారు. తమ పార్టీకి ఫలానా పదవి కావాలని కోరుకుంటున్న పార్టీల అగ్రనాయకత్వాలు ముందుగా ఆయా చోట్ల సమర్థులైన నాయకులు తయారు చేసుకోలేకపోవడాన్ని ఎత్తిచూపుతున్నారు. ఇక టీడీపీ నుంచి జనసేనలో చేరడం ద్వారా మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ దిగుమతి రాజకీయాలు 2.0కి తెరతీశారని వ్యాఖ్యానిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే విధంగా పలువురు నేతలు టీడీపీ నుంచి జనసేన, బీజేపీల్లోకి వెళ్లి ఎమ్మెల్యేలు అయిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ప్రధానంగా పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, భీమవరం ఎమ్మెల్యే రామాంజనేయులు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ టీడీపీ నుంచి జనసేనలో చేరి ఎమ్మెల్యే సీట్లు పొందారని చెబుతున్నారు. ఇదే లిస్టులో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి టీడీపీ నుంచి బీజేపీలోకి వెళ్లినట్లుగా చూపుతున్నారు. ఇప్పుడు మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ ద్వారా మొదలైన దిగుమతి రాజకీయాలు ఎందరికి పదవీ యోగం ప్రసాదిస్తుందో చూడాల్సివుందని అంటున్నారు.

# విశాఖ మేయర్ పీఠంపై తెర పైకి బాలయ్య కూతురి పేరు



**విశాఖపట్నం, అక్టోబరు 14 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో విశాఖపట్నం మేయర్ పదవికి ప్రత్యేక గుర్తింపు ఉంది. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, నగర ప్రాధాన్యం, భారీ బడ్జెట్ కారణంగా ఈ పదవిని దక్కించుకోవాలనిరాజకీయ నాయకులు ఆసక్తి చూపుతుంటారు. తాజాగా మేయర్ పదవికి మహిళా రిజర్వేషన్ ఖరారైనట్లు ప్రచారం జరగడంతో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. అధికార కూటమితో పాటు వైఎస్సార్‌సీపీ కూడా బలమైన అభ్యర్థుల కోసం అన్వేషిస్తున్నట్లు చర్చ సాగుతోంది. ముఖ్యంగా టీడీపీకి చెందిన ప్రముఖ కుటుంబాల మహిళల పేర్లు తెరపైకి రావడం ఆసక్తిని పెంచుతోంది.విశాఖ మేయర్‌పదవి మరోసారి మహిళకు దక్కనుండటంతో మహిళా నాయకుల మధ్య పోటీ పెరిగే అవకాశం కనిపిస్తోంది. 2021లో జరిగిన మేయర్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున బీసీ వర్గానికి చెందిన గొలగాని హరివెంకట కుమారి బాధ్యతలు చేపట్టారు. ఇప్పుడు కూడా మహిళా అభ్యర్థికే అవకాశం ఉండటంతో పార్టీలు సామాజిక సమీకరణాలు, రాజకీయ బలాబలాలను పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది.ఈ క్రమంలో నందమూరి తేజస్విని పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఆమె సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ రెండో కుమార్తె. విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ సతీమణి కూడా.

రాజకీయంగా ప్రభావం ఉన్న కుటుంబానికి చెందిన ఆమెను మేయర్ అభ్యర్థిగా నిలబెట్టవచ్చనే ప్రచారం సాగుతోంది. గతంలో భీమిలి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 2029 ఎన్నికల్లో పోటీ చేస్తారనే ఊహాగానాలు కూడా వినిపించాయి. అయితే మేయర్ పదవికి పోటీ చేసే విషయంలో ఆమె ఆసక్తి, పార్టీ నిర్ణయం ఏమిటన్నది ఇంకా స్పష్టతకు రాలేదు. ఆమె పేరు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చకు పరిమితమైంది.మరోవైపు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ సతీమణి లావణ్య పేరు కూడా వినిపిస్తోంది. ఆమెకు అవకాశం దక్కుతుందా అన్నది ఆసక్తికరంగా మారింది. విశాఖ టీడీపీ అధ్యక్షుడు పట్టాభిరాం సతీమణి పేరును కూడా కొందరు ప్రస్తావిస్తున్నారు. జనసేన నుంచి పెద్దిశెట్టి ఉషశ్రీ, ఉత్తర నియోజకవర్గానికి చెందిన ఉషా కిరణ్ పేర్లు చర్చలో ఉన్నాయి. బీజేపీ నుంచి ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు కుటుంబానికి చెందిన మహిళ పోటీ చేస్తారా అన్నది కూడా రాజకీయ వర్గాల్లో ఆసక్తిని కలిగిస్తోంది.వైఎస్సార్‌సీపీ తరఫున మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ సతీమణి బొత్స ఝాన్సీ పేరు వినిపిస్తున్నప్పటికీ, ఆమె పోటీపై స్పష్టత లేదు. పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కళ్యాణి పేరు కూడా ప్రచారంలో ఉంది. మాజీ ఎమ్మెల్యేల కుటుంబాల నుంచి కొత్త అభ్యర్థులు తెరపైకి వచ్చే అవకాశాలనూ కొట్టిపారేయలేం.మొత్తంగా విశాఖ మేయర్ పీఠం కోసం ప్రధాన పార్టీల్లో ఇప్పటి నుంచే కసరత్తు మొదలైనట్లు కనిపిస్తోంది. అయితే ప్రచారంలో ఉన్న పేర్లలో ఎవరికి పార్టీలు అవకాశంకల్పిస్తాయన్నది అధికారిక ప్రకటనల తర్వాతే తేలనుంది. సామాజిక సమీకరణాలు, రాజకీయ పలుకుబడి, స్థానిక నాయకుల మద్దతు ఈ ఎంపికలో కీలకంగా మారే అవకాశం ఉంది.

# ఏళ్ల చంద్రబాబు అనుభవానికి పవన్ పరీక్ష.. 40 శాతం లెక్క ఇదే..!



**విజయవాడ అక్టోబరు 14 పెన్ పవర్:** స్థానిక ఎన్నికలలో కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు సరికొత్త రాజకీయానికి తెరతీస్తోందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ముఖ్యంగా 50 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థత, సహనాన్ని పరీక్షించేలా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యవహార శైలి ఉందని అంటున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి కోసం తాము తగ్గామని చెబుతున్న పవన్.. ఇప్పుడు టీడీపీ ఆ మేరకు తగ్గాల్సిందేనని సంకేతాలు పంపుతున్నట్లుగా చెబుతున్నారు. జనసేన బలాబలాలతో సంబంధం లేకుండా మొత్తం పదవుల్లో 40 శాతం వాటా అడగడం, ఆ విషయాన్ని బహిర్గతం చేయడం ద్వారా అవసరమైతే ఒంటరి పోటీకి రెడీ అన్నట్లుగా జనసేన వైఖరి ఉందని అంటున్నారు. దీంతో కూటమిలో పొత్తు లెక్కలు క్షణక్షణానికి ఉత్కంఠ పెంచేస్తున్నాయని అంటున్నారు.స్థానిక ఎన్నికల్లో తమకు 40 శాతం సీట్లు ఇవ్వాలని పట్టుబడుతున్న జనసేన, 40 శాతం వాటా తమ హక్కుగా భావిస్తోందని చెబుతున్నారు. దీంతో ఒక్కసీటు తగ్గినా కుదరదు అన్నట్లుగా జనసేన అధినేత సంకేతాలు పంపుతున్నారని అంటున్నారు. ఈ కారణంగా సీట్ల పంచాయితీపై పీటముడి ఉత్కంఠకు గురిచేస్తోందని చెబుతున్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును ఒత్తిడికి గురిచేసి తన మాట నెగ్గించుకునేలా పవన్ ఆలోచన ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యమంత్రి సైతం మిత్రపక్షంపై మెతక వైఖరితో ఉండటం వల్ల టీడీపీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయని అంటున్నారు. 40 శాతం వాటా సీట్లు అడుగుతున్న జనసేన మళ్లీ ఆయా సీట్లలో పోటీకి తమ పార్టీ నేతలనే తీసుకోవడం ఏం రాజకీయమో కూడా అర్థం కావడం లేదని టీడీపీ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు.

**ముఖ్యమంత్రిని ఒత్తిడిక గురిచేసి..**

సీట్ల సర్దుబాటులో తన మాట నెగ్గించుకోవడమనే ఏకైక లక్ష్యంతో డిప్యూటీ సీఎం పవన్ పావులు కదుపుతున్నట్లుగా చెబుతున్నారు. ఇందుకు ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుపైనే తన అస్త్రాలు ప్రయోగిస్తున్నట్లుగా అనుమానిస్తున్నారు. పవన్ విషయంలో టీడీపీ అగ్రనేత చంద్రబాబుతోపాటు యువనేత లోకేశ్ కృతజ్ఞతాభావంతో ఉండటాన్ని పవన్ తనకు అనుకూలంగా మలుచుకున్నారని అంటున్నారు. అందుకే తాను కోరుతున్న సీట్ల విషయాన్ని బయటపెట్టి కూటమిలో ఇతర పక్షాలను ఒత్తిడికి లోను చేశారని అంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తమ కోసం తగ్గినట్లు చెబుతున్న పవన్, తన పార్టీకి ఉన్న వాస్తవ బలాన్ని ఇప్పుడు పరిగణనలోకి తీసుకోకపోవడంపైనే అంతా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో పవన్ అడిగిన అన్ని సీట్లు ఇచ్చినా, కొన్నిచోట్ల సమర్థులైన నేతలు లేక తమ పార్టీ నుంచి నాయకులను చేర్చుకుని పోటీకి పెట్టిన విషయాన్ని మరచిపోకూడదని కొందరు టీడీపీ నాయకులు గుర్తు చేస్తున్నారు. కానీ, పవన్ మాత్రం ఇప్పుడు గతాన్ని వదిలేసి అదే పద్ధతిలో ఎక్కువ సీట్లు తీసుకోవడమే కాకుండా, తమ పార్టీ నేతలను దిగుమతి చేసుకునే వ్యూహాన్ని అమలు చేస్తున్నారని చెబుతున్నారు. దీనివల్ల క్షేత్రస్థాయిలో తన పార్టీని బలోపేతం చేసుకోవడంతోపాటు స్థానిక సంస్థల్లో జన సేన భాగస్వామ్యం పెంచుకోవాలనే ఎత్తుగడను అమలు చేస్తున్నట్లుగా చెబుతున్నారు. నిజానికి కూటమిగా ఉన్నప్పుడు పార్టీల ఓట్ల శాతం ఆధారంగా సీట్ల పంపిణీ ఉంటుందని అంటున్నారు. కానీ, జనసేన మాత్రం తమ పార్టీ ఓటింగుతో సంబంధం లేకుండా బలంగా ఉన్నామని, కూటమిలో ప్రధాన పార్టీ టీడీపీతో సమానంగా వాటా కావాలని కోరుకోవడంపైనే పరిశీలకులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.ఇక కూటమిగా చర్చలకు కూర్చొన్న సమయంలో ఎక్కడో ఒక చోట ఏకాభిప్రాయానికి రావాల్సివుండగా, పవన్ మాత్రం మొండి పట్టుదలతో తాడోపేడో తేల్చేసుకుందాం.. అన్న స్థాయికి చర్చల వాతావరణాన్ని తీసుకువెళ్లడం కూడా రాజకీయంగా వేడిపుట్టిస్తోందని అంటున్నారు. రాష్ట్రంలో 123 పట్టణ స్థానిక సంస్థలు ఉండగా, 6 మేయర్, 38 మున్సిపల్ చైర్మన్ పదవులను కోరుతున్న జనసేన ఒక్క స్థానం కూడా వదులుకోలేమని చెప్పడం ద్వారా ధృడమైన వైఖరి తీసుకున్నట్లుగా సంకేతాలు పంపుతోందని అంటున్నారు. ఈ విషయమై టీడీపీలోనూ అంతర్గతంగా భారీగా చర్చ జరుగుతున్నట్లు చెబుతున్నారు. జనసేనకు వాస్తవ బలం ఉన్న చోట సీట్లు ఇవ్వడంలో ఎవరికీ అభ్యంతరం లేకపోయినా, 40 శాతం వాటా అంటూ ఎక్కువ సీట్లు అడగడంపై ఆ పార్టీలో క్షేత్రస్థాయి నుంచి పార్టీ పొలిట్ బ్యూరో వరకు అభ్యంతరాలు వ్యక్తమవుతున్నట్లుగా చెబుతున్నారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ కు భయపడి ఎవరూ ఈ విషయంపై బహిరంగంగా మాట్లాడే సాహసం చేయలేకపోతున్నారని అంటున్నారు.

# పులివెందుల వైసీపీ అభ్యర్థి వైఎస్ ప్రమీల



**కడప,అక్టోబరు 14 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల నగారా మోగిన వేళ, రాష్ట్రవ్యాప్తంగా అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి అడుగులు వేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. తన సొంత అడ్డాపులివెందులకు అభ్యర్థిని ఖరారు చేశారు. పులివెందుల మున్సిపల్ చైర్‌పర్సన్ వైయస్ఆర్‌సీపీ అభ్యర్థిగా వైఎస్ మనోహర్ రెడ్డి సతీమణి వైఎస్ ప్రమీలమ్మ పేరును జగన్ అధికారికంగా ప్రకటించారు. ఈ సారికుటుంబసభ్యులకు కాకుండా బయట వారికి చాన్సిస్తారని ప్రచారం జరిగినా.. అలాంటి ధైర్యం చేయలేకపోయారు.మనోహర్ రెడ్డి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి సోదరుడు మనోహర్ రెడ్డి.. జగన్‌కు బాబాయ్‌వరుసవుతారు. అటు జగన్ సతీమణి వైఎస్ భారతిరెడ్డి వైపు నుంచి కూడా వీరికి బలమైన కుటుంబ బాంధవ్యాలు ఉన్నాయి. దాదాపు మూడు దశాబ్దాలుగా పులివెందుల స్థానిక రాజకీయాలు, గ్రామీణపంచాయతీల నుంచి మున్సిపాలిటీ వరకు అంతా మనోహర్ రెడ్డి కనుసన్నల్లోనే నడిచేది. వైఎస్సార్ హయాం నుంచే స్థానిక సంస్థల పెత్తనాన్ని గుత్తాధిపత్యంగా నడిపిస్తున్న ఆయన.. జగన్ కేంప్‌కార్యాలయం, భారతి వ్యవహారాల్లోనూ తెరవెనుక కీలక చక్రం తిప్పుతూ వచ్చారు.పులివెందుల పురపాలక సంఘం చరిత్రను తిరగేస్తే.. ఈ దంపతుల చేతుల్లోనే స్థానిక అధికారం దశాబ్దాలుగా బందీఅయిందన్నది బహిరంగ రహస్యం. గతంలోనూ వైఎస్ ప్రమీలమ్మ పులివెందుల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. భర్త మనోహర్ రెడ్డి చక్రం తిప్పుతుంటే, భార్య ప్రమీలమ్మ చైర్‌పర్సన్ కుర్చీలోకూర్చుని నామమాత్రపు పాలన సాగించేవారు. మున్సిపాలిటీలో పనుల కేటాయింపులు, స్థానిక కాంట్రాక్టులు, వార్డుల నిర్వహణ అన్నీ వీరి కనుసన్నల్లోనే సాగాయి . పులివెందుల మున్సిపాలిటీలో నిజమైనప్రజాస్వామిక ప్రాతినిధ్యం గానీ, కొత్త నాయకత్వానికి అవకాశం గానీ దక్కలేదు. పార్టీలో ఏళ్ల తరబడి జెండాలు మోసి, కేసులు ఎదుర్కొన్న సామాన్య కిందిస్థాయి కార్యకర్తలకు ఎప్పుడూ కార్పొరేటర్ లేదావార్డు మెంబర్ టికెట్లే మిగిలాయి తప్ప.. కీలకమైన చైర్‌పర్సన్ కుర్చీ మాత్రం మళ్లీ తిరిగి ప్రమీలమ్మ ముంగిట్లోనే వాలింది.కడప ఎంపీగా అవినాష్ రెడ్డి, అసెంబ్లీలో జగన్, ఇప్పుడు మున్సిపాలిటీలో బాబాయ్‌భార్య ప్రమీలమ్మ.. ఇలా స్థానిక నుంచి పార్లమెంట్ దాకా అధికారం అంతా నాలుగు గోడల మధ్యే ఉండాలన్న జగన్ ఆధిపత్య మనస్తత్వాన్ని ఈ నిర్ణయం ప్రతిబింబిస్తోంది. గత సార్వత్రిక ఎన్నికల్లోపులివెందులలోనే మెజారిటీ గణనీయంగా తగ్గిపోయి సొంత గడ్డపైనే పట్టు సడలిన సంకేతాలు కనిపించినప్పటికీ.. జగన్ మాత్రం కనీస మార్పునకు సిద్ధపడలేదు.ఈ సారి ప్రత్యక్ష ఎన్నిక కావడంతో .. టీడీపీ బలమైన మహిళా అభ్యర్థిని నిలిపే అవకాశం ఉంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# DTH- కేబుల్ TV కస్టమర్లు తగ్గిపోవడానికి కారణం ఇదేనా?




టెలికామ్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా విడుదల చేసిన తాజా కథనాల ప్రకారం.. భారతీయ బుల్లితెర వీక్షణ రంగంలో స్పష్టమైన మార్పులు కనిపిస్తున్నాయి. సంప్రదాయ పే-డీటీహెచ్ -కేబుల్ టీవీ నెట్‌వర్క్‌లు తమ చందాదార్లను భారీగా కోల్పోతుండగా.. ఇంటర్నెట్ ఆధారిత ఐపీటీవీ విభాగం అనూహ్య వృద్ధిని నమోదు చేస్తోంది. మారుతున్న ప్రేక్షకుల అలవాట్లు .. వేగవంతమైన బ్రాడ్‌బ్యాండ్ సేవల విస్తరణే ఈ మార్పుకు ప్రధాన కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు.జూన్ 2026తో ముగిసిన సంవత్సర కాలంలో దేశంలోని పే-డీటీహెచ్ పరిశ్రమ ఏకంగా 75.1 లక్షల ఆక్టివ్ సబ్‌స్క్రైబర్లను కోల్పోయి 13.4 శాతం క్షీణతను నమోదు చేసింది. దీనితో మార్కెట్లో డీటీహెచ్ చందాదార్ల సంఖ్య 4.86 కోట్లకు పడిపోయింది. ఈ విభాగంలో టాటా ప్లే 30.56 శాతం మార్కెట్ వాటాతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. భారతీ టెలీమీడియా (27.97 శాతం), సన్ డైరెక్ట్ (22.51 శాతం), డిష్ టీవీ (18.96 శాతం) తదుపరి స్థానాల్లో నిలిచాయి. చందాదార్లు తగ్గినా.. సన్ డైరెక్ట్ మాత్రమే తన మార్కెట్ వాటాను స్వల్పంగా పెంచుకోగలిగింది.మరొక వైపు.. ఎంఎస్ఓ ల పరిధిలోని సంప్రదాయ కేబుల్ టీవీ రంగం కూడా తీవ్ర ప్రభావాన్ని ఎదుర్కొంది. తాజా రిపోర్ట్ ప్రకారం.. దేశంలోని తొమ్మిది ప్రధాన కేబుల్ నెట్‌వర్క్‌లు కేవలం తొమ్మిది నెలల్లోనే 44.25 లక్షల చందాదార్లను కోల్పోయాయి. జీటీపీఎల్ హాథ్‌వే అత్యధికంగా 22.28 లక్షల చందాలను కోల్పోగా.. డెన్ నెట్‌వర్క్స్ అత్యధికంగా 32.5 శాతం క్షీణతను చూసింది. అయితే ఈ ప్రతికూల పరిస్థితుల్లోనూ తమిళనాడు అరసు కేబుల్ టీవీ 12.3 శాతం వృద్ధి సాధించి మినహాయింపుగా నిలిచింది.ఈ క్షీణతకు భిన్నంగా ఐపీటీవీ సేవలు ఊహించని రీతిలో 333 శాతం వార్షిక వృద్ధిని సాధించి రికార్డు సృష్టించాయి. గత జూన్ 2025లో 14.34 లక్షలుగా ఉన్న ఐపీటీవీ సబ్‌స్క్రిప్షన్ల సంఖ్య జూన్ 2026 నాటికి ఏకంగా 62.07 లక్షలకు చేరుకుంది. ఈ రంగంలో భారతీ ఎయిర్‌టెల్ 40.91 లక్షల చందాదార్లతో ప్రధాన వాటాను దక్కించుకోగా.. హాథ్‌వే డిజిటల్ కూడా జూన్ త్రైమాసికంలో అత్యధిక వృద్ధిని కనబరిచి రెండో స్థానంలో నిలిచింది.మొత్తంగా చూస్తే డీటీహెచ్, కేబుల్, ఐపీటీవీ, హెచ్ఐటీఎస్ రంగాలు అన్ని కలిపి దేశంలో జూన్ 2026 నాటికి 9.67 కోట్ల యాక్టివ్ సబ్‌స్క్రిప్షన్లను కలిగి ఉన్నాయి. హై-స్పీడ్ ఇంటర్నెట్ వినియోగం పెరగడం.. ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌ల ప్రాచుర్యం.. ఐపీటీవీ ఆఫర్లు సులభంగా అందుబాటులోకి రావడంతో... భారతీయ టీవీ వీక్షకులు క్రమంగా ఇంటర్నెట్ ఆధారిత వినోద మార్గాల వైపు వేగంగా మొగ్గు చూపుతున్నారని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

# వలసదారులు లేకపోతే ఆస్ట్రేలియా పరిస్థితి ఏంటి?




ఆస్ట్రేలియా ప్రభుత్వం ఇటీవల వీసా నిబంధనలను కఠినతరం చేయడం, అక్రమ వలసదారులను తిరిగి పంపించేసేందుకు చట్టాలను తీసుకురావడంతో అక్కడ పెద్ద చర్చ మొదలైంది. 'ఒకవేళ వలసదారులందరినీ వెనక్కి పంపిస్తే ఆస్ట్రేలియాకు ఏమవుతుంది?' అని వివరిస్తూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఒక పోస్ట్ తీవ్ర దుమారం రేపుతోంది. వలసదారులు లేకపోతే దేశ ఆర్థిక వ్యవస్థ, రోజువారీ సేవలు ఎలా కుప్పకూలుతాయో తెలిపే ఆసక్తికర వివరాలు ఇప్పుడు చూద్దాం..

**సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సందేశం:**

వలసదారుల ప్రాముఖ్యతను గుర్తుచేస్తూ గతంలో బ్రిటన్‌లో వైరల్ అయిన తరహా నోటీసే ఇప్పుడు ఆస్ట్రేలియా నెట్టింట విపరీతంగా చక్కర్లు కొడుతోంది. "మీరు వలసదారులందరినీ వెళ్లిపోవాలని కోరుకుంటే.. రేపటి నుంచి దేశంలో ఆసుపత్రుల్లో సగానికి పైగా డాక్టర్లు, నర్సులు ఉండరు. భవనాలు, ఇళ్ల నిర్మాణాలు పూర్తిగా ఆగిపోతాయి. వ్యవసాయ పొలాల్లో పంటలు కోసేవారు, సూపర్ మార్కెట్లలో సరుకులు నింపే సిబ్బంది కరువవుతారు" అంటూ ఆ పోస్ట్‌లో వ్యంగ్యంగా పేర్కొన్నారు.

స్థానికులు చేయని పనులే వారి ఉపాధి:

ఉదయపు కాఫీ అందించే బారిస్టాలు, హోటళ్లలో వంట చేసే షెఫ్‌లు, ఇళ్లు మరియు వీధులను శుభ్రం చేసే పారిశుధ్య కార్మికులు ఎవరూ కనిపించరని ఆ నోటీసు హెచ్చరిస్తోంది. ఇక వలసదారులు స్థానికుల ఉద్యోగాలను లాక్కోవడం లేదని, నిజానికి స్థానిక పౌరులు చేయడానికి ఇష్టపడని కష్టమైన పనులను చేస్తూ ఈ దేశాన్ని ముందుండి నడిపిస్తున్నారనే నిజాన్ని ఈ వైరల్ నోటీసు స్పష్టంగా ఎత్తిచూపుతోంది.

**ఆస్ట్రేలియా ప్రభుత్వ కఠిన చట్టాలు, స్థానికుల ఆందోళనలు:**

మరోవైపు ఆస్ట్రేలియాలో పెరిగిపోతున్న ఇళ్ల కొరత, జీవన వ్యయానికి విపరీతంగా పెరిగిన వలసలే కారణమని భావిస్తూ కొన్ని స్థానిక వర్గాలు ఇమ్మిగ్రేషన్ వ్యతిరేక ర్యాలీలు చేపడుతున్నాయి. ఇక దీంతో ప్రభుత్వం కూడా వీసా నిబంధనలు ఉల్లంఘించిన వారిని, నేరాలకు పాల్పడిన అక్రమ నివాసితులను డిటెన్షన్ సెంటర్లకు తరలిస్తూ కఠిన వలస చట్టాలను అమల్లోకి తెచ్చింది. అంతర్జాతీయ విద్యార్థుల వీసాలపై కూడా భారీగా కోతలు విధిస్తోంది.

**రంగాలు కుప్పకూలే ప్రమాదం ఉందని నిపుణుల హెచ్చరిక:**

ఆస్ట్రేలియాలోని హెల్త్‌కేర్, వ్యవసాయం, హోటల్ రంగం, నిర్మాణ రంగాలు పూర్తిగా విదేశీ కార్మికులు మరియు విద్యార్థులపైనే ఆధారపడి పనిచేస్తున్నాయి. వీసా నిబంధనల పేరుతో వలసలను అకస్మాత్తుగా అడ్డుకుంటే ఆయా రంగాలు తీవ్ర నష్టాల్లో కూరుకుపోతాయని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక దేశం ముందుకు సాగాలంటే వలసదారుల శ్రమ ఎంతో కీలకమని వారు స్పష్టం చేస్తున్నారు.ఇక మొత్తానికి చూస్తే, ఆస్ట్రేలియాలో నడుస్తున్న ఈ వలసదారుల వివాదం కేవలం రాజకీయ అంశంగానే కాకుండా దేశ భవిష్యత్తును శాసించేదిగా మారింది. కొత్త చట్టాలతో ప్రభుత్వం ముందుకు వెళ్తున్నప్పటికీ, దేశ పురోగతిలో వలసదారుల పాత్ర ఎంత ఉందో ఈ వైరల్ నోటీసు కళ్లకు కట్టినట్లు చూపిస్తోంది. వలసలపై కఠిన చర్యలు తీసుకునే ముందు దేశ అవసరాలను బ్యాలెన్స్ చేయాల్సిన అవసరం ఉందనేది స్పష్టమవుతోంది.

# సౌదీ అరేబియాలో చమురు కేంద్రంపై దాడి..

# రియాద్‌కు క్షిపణుల ముప్పు




సౌదీ అరేబియాలోని తూర్పు ప్రావిన్స్‌లో ఉన్న ప్రపంచంలోని అతిపెద్ద చమురు ఉత్పత్తి సంస్థల్లో ఒకటైన అరామ్‌కోకు చెందిన పరిపాలనా భవనంలో మంగళవారం స్వల్పంగా మంటలు చెలరేగాయి. ఈ భవనంపై దాడి జరిగినట్లు ఆ దేశ ఇంధన శాఖ వెల్లడించింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని తెలిపింది.ఇరాన్ మద్దతున్న హౌతీ తిరుగుబాటుదారులు, వారితో పోరాడుతున్న సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు మంగళవారం రాత్రి పరస్పరం దాడులు చేసుకున్నాయి. దీంతో మధ్యప్రాచ్యంలో విస్తరిస్తున్న సంక్షోభం మరింత తీవ్రమైంది. చమురు ఉత్పత్తికి కీలకమైన తూర్పు ప్రావిన్స్‌తో పాటు రాజధాని రియాద్ వైపు క్షిపణులు వస్తున్నట్లు సౌదీ సంకీర్ణ దళాలు హెచ్చరికలు జారీ చేసిన కొద్దిసేపటికే ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి.రియాద్‌లో రెండు హౌతీ క్షిపణులను సౌదీ రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయి. వాటి శకలాలు నివాస ప్రాంతాల్లో పడటంతో నలుగురు గాయపడ్డారు. 15 ఇళ్లు దెబ్బతిన్నాయని సౌదీ పౌర రక్షణ విభాగం వెల్లడించింది.

**సనా చమురు నిల్వ కేంద్రాలే లక్ష్యంగా వైమానిక దాడులు...**

యెమెన్ రాజధాని సనాపై సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు మంగళవారం కొత్తగా వైమానిక దాడులు చేశాయి. హౌతీల ఆధీనంలోని అల్ మసీరా టెలివిజన్ ఛానల్, స్థానికులు ఈ విషయాన్ని వెల్లడించారు. దాడులకు ముందు ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సంకీర్ణ దళాల అధికార ప్రతినిధి హెచ్చరించారు.నగరానికి పశ్చిమాన ఉన్న సుబాహ్ ఇంధన కేంద్రంపై దాడి చేసిన కొన్ని గంటల తర్వాత సనాలో భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.సనాలోని యెమెన్ ఆయిల్ కంపెనీ కేంద్రం, సమీపంలోని ఇంధన నిల్వ ప్రాంతాల నుంచి ప్రజలు వెళ్లిపోవాలని సంకీర్ణ దళాలు అంతకుముందు అరుదైన ప్రకటనలో కోరాయి. రాజధానిని ఆనుకుని ఉన్న కొండపై ఈ చమురు సంస్థ కేంద్రం ఉంది.హౌతీలు తమ క్షిపణులు, డ్రోన్ల కోసం ఈ కేంద్రాన్ని, భూగర్భ ఇంధన నిల్వలను ఉపయోగిస్తున్నారని సంకీర్ణ దళాల అధికార ప్రతినిధి మేజర్ జనరల్ తుర్కీ అల్ మాలికీ ఆరోపించారు.దాడి జరుగుతుందని హౌతీ అధికారులు ముందే ఊహించినట్లు కనిపించింది. తమ నిల్వ కేంద్రాల్లో చమురు లేదని, సౌదీ దాడి వల్ల చమురు నిల్వలు లేదా ప్రజలకు సరఫరాలపై ప్రభావం ఉండదని యెమెన్ ఆయిల్ కంపెనీ ప్రకటించింది. అయినప్పటికీ కొరత ఏర్పడుతుందన్న భయంతో కొన్ని పెట్రోల్ బంకుల వద్ద వాహనాలు బారులు తీరాయని స్థానికులు తెలిపారు.ఈ హెచ్చరిక వెలువడిన కొద్దిసేపటికే హౌతీ సైనిక ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ యాహ్యా సరీఫ్ టెలిగ్రామ్‌లో స్పందించారు. సనాపై సౌదీ దాడి చేస్తే రాజధాని రియాద్‌పై 'గట్టిగా, బాధాకరంగా' ప్రతిదాడి చేస్తామని హెచ్చరించారు.కొన్ని గంటల తర్వాత రియాద్, తూర్పు ప్రావిన్స్ వైపు క్షిపణులు వస్తున్నట్లు సౌదీ అరేబియా హెచ్చరికలు జారీ చేసింది. అయితే కొద్దిసేపటికే ముప్పు తొలగిపోయిందని ప్రకటించింది. దేశంలోని పలు ప్రాంతాల్లో హౌతీలు ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లు, క్రూయిజ్ క్షిపణులను అడ్డుకున్నట్లు సంకీర్ణ దళాలు తెలిపాయి. రియాద్‌తో పాటు దక్షిణ ప్రావిన్స్ వాదీ అల్ దవాసిర్‌లోనూ ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. రియాద్‌లో భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయని స్థానికులు చెప్పారు.

**41 శాతం విమాన సర్వీసులు రద్దు...**

మరిన్ని దాడులు జరిగే ప్రమాదం ఉందన్న అంచనాతో బీమా సంస్థలు, ప్రభుత్వ అధికారుల సూచన మేరకు విమానయాన సంస్థలు మంగళవారం రియాద్ నుంచి తమ విమానాలను ఇతర విమానాశ్రయాలకు తరలించాయి. ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చే సర్వీసులు కొనసాగించేందుకు ఈ చర్య తీసుకున్నట్లు విమానయాన ప్రమాదాలపై సంస్థలకు సలహాలిచ్చే ఓస్ప్రే ఫ్లైట్ సొల్యూషన్స్ చీఫ్ ఇంటెలిజెన్స్ అధికారి మాథ్యూ బోరీ తెలిపారు."ఈ ప్రాంతంలో ఇటీవలి కాలంలో చోటుచేసుకున్న సంఘర్షణలను చూస్తే ఇలాంటి చర్యలు అసాధారణమేమీ కాదు" అని ఆయన పేర్కొన్నారు.విమానయాన విశ్లేషణ సంస్థ సిరియం గణాంకాల ప్రకారం.. అక్టోబర్ 8 నుంచి సౌదీ అరేబియాలోని విమానాశ్రయా ల నుంచి బయలుదేరాల్సిన 3,120కి పైగా విమాన సర్వీసులు రద్దయ్యాయి లేదా నడవడం లేదని నమోదయ్యాయి. ఇది మొత్తం షెడ్యూల్ సర్వీసుల్లో సుమారు 41 శాతం. బుధవారం బయలుదేరాల్సిన 300కు పైగా విమానాలు కూడా ఇందులో ఉన్నాయి.హౌతీలు విమానాశ్రయాలపై దాడులు చేయడంతో పలు విమానయాన సంస్థలు సౌదీ అరేబియాకు తమ సర్వీసులను నిలిపివేశాయి.మంగళవారం యెమెన్‌పై జరిగిన దాడి సైనిక చర్యలను మరింత పెంచే సంకేతమా? లేక రియాద్ విమానాశ్రయంపై ఇటీవల జరిగిన ప్రాణాంతక దాడులకు పరిమితంగా ఇచ్చిన ప్రతిస్పందనా? అన్నది స్పష్టంగా తెలియరాలేదు."హౌతీల ఆధీనంలోని ప్రాంతాల లోతట్టు ప్రాంతాలపై దాడులు చేస్తూ, తాము హౌతీల కంటే జాగ్రత్తగా, మానవతా దృక్పథంతో వ్యవహరిస్తున్నామని చూపించేందుకు సౌదీ ప్రయత్నిస్తోంది. ఉద్రిక్తతలను మరింత పెంచాలన్న దాని ఉద్దేశం ఈ హెచ్చరికలు, దాడుల్లో కనిపిస్తోంది" అని వాషింగ్టన్‌కు చెందిన న్యూ అమెరికా సంస్థ పరిశోధకుడు ఆడమ్ బారన్ విశ్లేషించారు."ఇది హెచ్చరిక కావచ్చు. లేదా ముందు జరగబోయే పరిణామాలకు సంకేతం కావచ్చు" అని ఆయన అన్నారు.

**కీలక సముద్ర మార్గం కోసం పోరు...**

హౌతీలు ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్లను అడ్డుకోవడంలో తమ రక్షణ వ్యవస్థలు ఎందుకు విఫలమయ్యాయో సౌదీ అరేబియా ఇంకా సమీక్షిస్తోంది. శనివారం రియాద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై జరిగిన దాడిలో కనీసం 13 మంది మరణించగా, 300 మందికి పైగా గాయపడ్డారు.యెమెన్‌లోని బాబ్ అల్ మండెబ్ జలసంధి వెంబడి కీలక ప్రాంతాలను హౌతీలు గత నెలలో స్వాధీనం చేసుకోవడంతో సౌదీ అరేబియా, హౌతీల మధ్య తాజా పోరు మొదలైంది. ఎర్ర సముద్రం దక్షిణ చివరన ఉన్న ఈ జలసంధి గల్ఫ్ ప్రాంత చమురు, ఇతర వస్తువుల రవాణాకు అత్యంత కీలకం.యెమెన్‌లో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ప్రభుత్వానికి మద్దతిస్తున్న సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు ఈ ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి.హౌతీలు సౌదీపై పదేపదే దాడులు చేస్తే పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని సౌదీ మంత్రివర్గం మంగళవారం హెచ్చరించింది. "తమ భద్రతకు, ఎర్ర సముద్రం, బాబ్ అల్ మండెబ్ జలసంధిలో సముద్ర రవాణా స్వేచ్ఛకు ఎలాంటి ముప్పు వచ్చినా రాజ్యం సహించదు" అని సౌదీ ప్రభుత్వ ఆధ్వర్యంలోని అల్ ఎఖ్బారియా టెలివిజన్ ప్రసారం చేసిన ప్రకటనలో మంత్రివర్గం స్పష్టం చేసింది. పర్షియన్ గల్ఫ్ నుంచి చమురు రవాణాకు బాబ్ అల్ మండెబ్ మరో కీలక మార్గం.

**తైజ్ నగరంలో తీవ్ర పోరు.. ఆరుగురు మృతి...**

యెమెన్ నైరుతి ప్రాంతంలోని కీలక నగరం తైజ్‌పై హౌతీలు గత 24 గంటల్లో చేసిన దాడుల్లో ఆరుగురు మరణించగా, 18 మంది గాయపడ్డారని ఆ దేశ అంతర్గత వ్యవహారాల శాఖ మంగళవారం ఎక్స్‌లో వెల్లడించింది. ఈ ప్రాంతంలో పోరు కొనసాగుతోంది.సౌదీ మద్దతున్న దళాలకు చెందిన ఓ కమాండర్ వివరాల ప్రకారం.. తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొన్నప్పటికీ తిరుగుబాటుదారులు తైజ్ నగర శివార్లకు చేరుకున్నారు. వారిలో కొందరు నగరంలోకి కూడా ప్రవేశించారు. చాలాకాలంగా ఇరుపక్షాలకూ కీలక లక్ష్యంగా ఉన్న తైజ్ కోసం పోరు ఇప్పుడు నిర్ణయాత్మక దశకు చేరుకుందని ఆయన తెలిపారు. యుద్ధరంగ పరిస్థితుల గురించి వివరించేందుకు పేరును వెల్లడించడానికి ఇష్టపడని ఆ కమాండర్.. తిరుగుబాటు దళాల సంఖ్య ఊహించిన దానికంటే ఎక్కువగా ఉందని, వాటి వద్ద స్వల్ప, మధ్యశ్రేణి బాలిస్టిక్ క్షిపణులు కూడా ఉన్నాయని చెప్పారు.పోరు కారణంగా పెద్ద ఎత్తున ప్రజలు ఇళ్లను వదిలి వెళ్లాల్సి వస్తోందని, ఆహారం, ఇతర నిత్యావసరాల కొరత పెరుగుతోందని ఐక్యరాజ్యసమితి ప్రతినిధి స్టీఫెన్ దుజారిక్ మంగళవారం తెలిపారు. వంటగ్యాస్ దొరకడం కష్టంగా మారిందని, ఆహార ధరలు సుమారు 50 శాతం పెరిగినట్లు నివేదికలు అందాయని చెప్పారు.హౌతీలపై పోరులో అమెరికా సైన్యం మరింత ప్రత్యక్షంగా సహకరించాలని సౌదీ అరేబియా కోరుతోంది. సౌదీ నేతృత్వంలోని దాడుల కోసం అమెరికా ఇప్పటికే నిఘా సమాచారాన్ని పంచుకోవడం, లక్ష్యాలను గుర్తించడం, ప్రణాళికలు రూపొందించడంలో సాయం చేసింది. అయితే హౌతీలపై నేరుగా దాడులు చేయడానికి మాత్రం వెనుకంజ వేసింది.అమెరికా సైన్యం రంగంలోకి దిగితే బాబ్ అల్ మండెబ్ జలసంధి గుండా నౌకల రాకపోకలను అడ్డుకునేందుకు హౌతీలు ప్రయత్నించే అవకాశం ఉంది.

# కాక్రోచ్ జనతా పార్టీ విద్రోహ శక్తి.. అమెరికా నుంచి నిధులు: సింగర్ సంచలన ఆరోపణలు



అమెరికా సింగర్.. మేరీ మిల్బన్.. కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ)పై సంచలన ఆరోపణలు గుప్పించా రు. ఇన్‌స్టా వేదికగా ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యాఖ్యలను బీజేపీ నేతలు తమకు ఆయుధంగా మలుచుకోగా.. అభిజిత్ దీప్కే సహా.. సీజేపీ నేతలు మాత్రం మౌనంగా ఉన్నారు. ఇక, మేరీ చేసిన వ్యాఖ్యలను గమనిస్తే.. సీజేపీపై ఇప్పుడున్న ఇమేజ్ పూర్తిగా తుడిచి పెట్టుకుపోవడం ఖాయమని అంటున్నారు.

**ఏం జరిగింది...?**

దేశంలో సోషల్ మీడియా వేదికగా సాగుతున్న 'కాక్రోచ్ జనతా పార్టీ' ఉద్యమం నకిలీదని, విద్రోహ శక్తులతో సీజేపీకి సంబంధాలు ఉన్నాయని అమెరికన్ సింగర్ మేరీ మిల్బన్ సంచలన ఆరోపణలు చేశారు. అభిజీత్ దీప్కే నేతృత్వంలోని ఈ కాక్రోచ్ జనతా పార్టీకి అమెరికాకు చెందిన దాతల నుండి నిధులు అందుతున్నాయని ఆరోపించారు. విదేశీ నిధులను తీసుకుంటున్న సీజేపీ భారత్‌లో విధ్వంసాలకు ప్రణాళికలు రూపొందించినట్టు తనకు సమాచారం ఉందన్నారు. భారత దేశంలో నడుస్తున్న ఈ వ్యంగ్య రాజకీయ ఉద్యమానికి అమెరికాలోని కొంతమంది దాతలు వెనకుండి ఆర్థికంగా సహాయం అందిస్తున్నారని మేరీ మిల్బన్ ఆరోపించారు. అంతేకాదు.. తాను ఇప్పటికే అన్ని విషయాలు తెలిసినా.. మౌనంగా ఉన్నానని తెలిపారు. కానీ, ఇప్పుడు మౌనంగా ఉండే సమయం దాటిపోయిందన్నారు. ఇది భారతదేశానికి సంబంధించిన కీలక విషయమని, ఇలాంటి సమయంలో తాను ఇకపై మౌనంగా ఉండే ప్రసక్తే లేదని మేరీ స్పష్టం చేశారు.అదేసమయంలో మేరీ.. యువతకు పిలుపునిస్తూ.. దేశంలోని "యువ దేశభక్తులు-- అందరూ ముందుకు వచ్చి దేశ శ్రేయస్సు కోసం నిలబడాలని అన్నారు. కాక్రోచ్ వంటి విద్రోహ శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆమె పిలుపునిచ్చారు. మరిన్ని విషయాలను తాను త్వరలోనే బయట పెట్టనున్నట్టు మేరీ వెల్లడించారు. ఇదే సమయంలో ప్రధాని మోడీపై ఆమె ప్రశంసలు గుప్పించారు.

గత 25 ఏళ్లుగా ప్రజాసేవలో ఉన్న మోడీ.. ఇలాంటి(సీజేపీ) విద్రోహ శక్తులకు తల వంచరని పేర్కొన్నారు. ఇలాంటి శక్తులు చాలా చోట్ల ఉన్నాయని.. ఎక్కడా విజయం సాధించలేదని ఆమె వ్యాఖ్యానించారు. మోడీ నేతృత్వంలో భారత్ వెలిగిపోతోందని ఆమె చెప్పడం గమనార్హం. ఈ నేపథ్యంలో బీజేపీ ఈ వ్యాఖ్యలను తనకు అనుకూలంగా మార్చుకుని సీజేపీ నైజం ఇదేనని ప్రకటించడం గమనార్హం. తాము మొదటి నుంచి అనుమానిస్తున్నదే ఇప్పుడు జరుగుతోందని బీజేపీ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు.

# : మెక్సికోలో వరదలు, కొండచరియలు విరిగిపడి ఆరుగురి మృతి

హరికేన్ సైమన్, ఉష్ణమండల తుపాను రేచెల్ అవశేషాల ప్రభావంతో మెక్సికో పసిఫిక్ తీరంలో భారీ వర్షాలు కురిశాయి. వరదలు, కొండచరియలు విరిగిపడటంతో మంగళవారం నాటికి ఆరుగురు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. అమెరికాలోని మియామిలో ఉన్న జాతీయ హరికేన్ కేంద్రం ప్రకారం.. సైమన్ తొలుత కేటగిరీ-1 హరికేన్‌గా ఉంది. మంగళవారం రాత్రి మరింత బలపడటంతో మరోసారి తీవ్ర హరికేన్ స్థాయికి చేరువైంది. మెక్సికో పసిఫిక్ తీరంలోని నయారిట్, సినలోవా రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిపించింది. నదుల్లో నీటిమట్టం పెరగడం, వరదలు ముంచెత్తే ప్రమాదం ఉండటంతో అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. వారాంతంలో దక్షిణ గెరెరో రాష్ట్రంలోనూ సైమన్ భారీ వర్షాలు కురిపించింది. అక్కడ ఒకరు మరణించారు.అయితే, ఉత్తరాన ఉన్న బాజా కాలిఫోర్నియా రాష్ట్రంలోని తీర నగరం ఎన్సెనాడాలో రేచెల్ తుపాను అవశేషాల ప్రభావంతో తీవ్ర నష్టం వాటిల్లింది. వరదల్లో కనీసం ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 13 ఏళ్ల బాలిక ఉంది. ఆమె మృతదేహాన్ని ఆదివారం గుర్తించారు. 30, 35 ఏళ్ల ఇద్దరు మహిళలు, నాలుగేళ్ల బాలుడి మృతదేహాలను సోమవారం వెలికితీశారు.




**మరికొందరి ఆచూకీ కోసం...**

మంగళవారం ఓ వాగు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ వివరాలను రాష్ట్ర ప్రాసిక్యూటర్ కార్యాలయం అసోసియేటెడ్ ప్రెస్‌కు తెలిపింది.బాజా కాలిఫోర్నియాలో మరో ఐదుగురు ఆచూకీ తెలియాల్సి ఉంది. వీరిలో ముగ్గురు ఎన్సెనాడాకు చెందినవారు. కాలిఫోర్నియా గల్ఫ్‌లోని శాన్ ఫెలిపే ప్రాంతంలో శనివారం చేపల వేటకు వెళ్లిన తండ్రీకొడుకులు తిరిగి రాలేదు.ఎన్సెనాడాలోని ఎల్ పిపిలా వాగు పరిసరాల్లో మంగళవారం సుమారు 300 మంది సైనికులు, పోలీసులు, సహాయక సిబ్బంది గాలింపు చేపట్టారు. గల్లంతైన మత్స్యకారుల కోసం మెక్సికో నౌకాదళం కూడా గాలిస్తోంది. ఈ వివరాలను రాష్ట్ర పౌర రక్షణ అధికారులు వెల్లడించారు.వరద నీరు వాహనాలను కొట్టుకుపోయేలా చేసింది. ఇళ్లను దెబ్బతీసింది. కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.ఎన్సెనాడాలోని బ్యూనా విస్టా ప్రాంతానికి చెందిన జొహానా నురియులు మాట్లాడుతూ.. రాత్రిపూట భారీ వర్షం కురిసి విద్యుత్ సరఫరా నిలిచిపోయిన కొద్దిసేపటికే వరదలు మొదలయ్యాయని చెప్పారు.“సముద్రపు అలల శబ్దంలా, కానీ చాలా తీవ్రంగా ఓ పెద్ద శబ్దం వినిపించింది” అని ఆమె తెలిపారు. బయటకు వచ్చి చూడగా సమీపంలోని వాగు పొంగి ప్రవహిస్తోందని గుర్తించినట్లు చెప్పారు.“నీరు అన్నింటినీ కొట్టుకుపోయింది. ఓ చిన్న గుడిసెను, జంతువులను.. ఇలా అన్నింటినీ తీసుకెళ్లిపోయింది” అని ఆమె వివరించారు.ఎన్సెనాడా సమీపంలోని రాంచో జెనెసిస్ శిబిరంలో చిక్కుకున్న 32 మందిని మెక్సికో సైనికులు హెలికాప్టర్ల సాయంతో కాపాడారు. వారిలో 13 మంది చిన్నారులు ఉన్నారు. అనాథ పిల్లల కోసం మిషనరీలు నిర్వహిస్తున్న ఈ శిబిరంలో సహాయక చర్యలు చేపట్టారు. రక్షించిన వారిలో 22 మంది విదేశీయులని సైన్యం తెలిపింది. వారిలో అమెరికా, జర్మనీకి చెందినవారు కూడా ఉన్నట్లు బాజా కాలిఫోర్నియా భద్రతా కార్యదర్శి జనరల్ లౌరియానో కారిల్లో వెల్లడించారు.

**పసిఫిక్ తీరాన్ని ఆనుకుని సైమన్.. మరో తుపాను ముప్పు...**

సైమన్ మంగళవారం మెక్సికో పసిఫిక్ తీరానికి సమాంతరంగా కదులుతూ జాలిస్కో, నయారిట్, సినలోవా రాష్ట్రాల్లో మరిన్ని వర్షాలు కురిపించే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు.జాలిస్కో రాష్ట్రంలోని కాబో కొరియెంటెస్‌కు పశ్చిమాన సుమారు 120 మైళ్ల (195 కిలోమీటర్ల) దూరంలో హరికేన్ కేంద్రం ఉన్నట్లు జాతీయ హరికేన్ కేంద్రం తెలిపింది. గంటకు 110 మైళ్ల (175 కిలోమీటర్ల) వేగంతో గాలులు వీస్తున్నాయని వెల్లడించింది.దక్షిణ గెరెరో రాష్ట్రంలో సైమన్ వర్షాల కారణంగా చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. రహదారులపై రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. అకాపుల్కో పర్యాటక నగరంతో పాటు తీర ప్రాంతాల్లో ఇళ్లలోకి వరద నీరు చేరింది. చిల్పాన్సింగోలో గోడ కూలడంతో 71 ఏళ్ల వ్యక్తి మరణించినట్లు రాష్ట్ర గవర్నర్ ఎవెలిన్ సల్గాడో తెలిపారు.సినలోవా రాష్ట్రంలోని మజట్లాన్ నౌకాశ్రయ నగరంలో తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ విషయాన్ని జాతీయ పౌర రక్షణ విభాగం సమన్వయకర్త లౌరా వెలాస్క్వెజ్ సోమవారం తెలిపారు.మరోవైపు

జాలిస్కోలోని ప్యూర్టో వలార్టా పర్యాటక ప్రాంతంలో వాతావరణం క్రమంగా మెరుగుపడుతోంది. వర్షాలు తగ్గడంతో ప్రజలు సాధారణ కార్యకలాపాలను తిరిగి ప్రారంభించారు. మంగళవారం నుంచి పాఠశాలలను తెరవాలని రాష్ట్ర అధికారులు ఆదేశించారు. ప్యూర్టో వలార్టా విమానాశ్రయంలోనూ కార్యకలాపాలు క్రమంగా పునరుద్ధరించారు.ఇదిలా ఉండగా, మంగళవారం పసిఫిక్ మహాసముద్రంలో ట్రూడీ అనే ఉష్ణమండల తుపాను ఏర్పడింది. రానున్న కొద్ది రోజుల్లో అది తీవ్ర హరికేన్‌గా మారే అవకాశం ఉందని మియామిలోని జాతీయ హరికేన్ కేంద్రం తెలిపింది. మెక్సికోలోని అకాపుల్కోకు దక్షిణ-ఆగ్నేయంగా సుమారు 490 మైళ్ల (790 కిలోమీటర్ల) దూరంలో ఈ తుపాను కేంద్రీకృతమై ఉంది. గంటకు 40 మైళ్ల (65 కిలోమీటర్ల) వేగంతో గాలులు వీస్తున్నాయి.

# ఉక్రెయిన్‌పై రష్యా క్షిపణి దాడులు

ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో పౌర మౌలిక సదుపాయాలపై రష్యా ఐదు బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేసినా.. తమ భాగస్వామ్య దేశాల నుంచి ముందస్తు హెచ్చరికలు రాలేదని అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ మంగళవారం చెప్పారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఆయనకు విభేదాలు పెరుగుతున్న సమయంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఏయే దేశాల నుంచి సమాచారం రాలేదో జెలెన్‌స్కీ స్పష్టం చేయలేదు. ఈ క్షిపణి దాడులను ఆయన ‘చాలా హేయమైనవి’గా అభివర్ణించారు. ఇలాంటి దాడులపై భాగస్వామ్య దేశాలు ముందుగానే నిఘా సమాచారాన్ని అందిస్తే ప్రాణాలను కాపాడవచ్చని చెప్పారు. ఇది అత్యంత కీలకమైన అంశాల్లో ఒకటని పేర్కొన్నారు.“బాలిస్టిక్ క్షిపణులు వస్తున్నాయని ముందుగానే హెచ్చరిస్తే ప్రజల ప్రాణాలను కాపాడవచ్చు. ఇలాంటి సమాచారం ప్రాణనష్టాన్ని నివారించేందుకు ఎంతో ఉపయోగపడుతుంది” అని ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.అయితే, ఉక్రెయిన్‌కు నిఘా సమాచారాన్ని అందించడం ఆపలేదని ట్రంప్ చెప్పారు. “మేం ఉక్రెయిన్‌కు సహాయం చేస్తున్నాం. నిఘా సమాచారాన్ని కూడా పంచుకుంటున్నాం. యుద్ధం ముగియాలని కోరుకుంటున్నాం. అందుకే ఉక్రెయిన్, రష్యాలతో కలిసి ఈ దిశగా పనిచేస్తున్నాం” అని వైట్‌హౌస్‌లో విలేకరులతో అన్నారు.మంగళవారం రాత్రి కీవ్‌లోని ఇంధన వ్యవస్థలపై రష్యా మరోసారి క్షిపణులతో దాడి చేసింది. ఈ దాడికి ముందు కూడా భాగస్వామ్య దేశాల నుంచి ఎలాంటి హెచ్చరికలు రాలేదని జెలెన్‌స్కీ చెప్పారు.“ఈ విషయంలో ప్రపంచం మౌనంగా ఉండకూడదు. అమెరికా కూడా వాస్తవంగా ఏం జరుగుతోంది? ఈ యుద్ధం కొనసాగడానికి ఎవరు బాధ్యులు? అన్నది గుర్తించాలి” అని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు.ఉక్రెయిన్‌కు కొత్త అధ్యక్షుడు రావాల్సిన సమయం ఆసన్నమైందని, యుద్ధాన్ని ముగించేందుకు జెలెన్‌స్కీ తగినంతగా ప్రయత్నించడం లేదని ట్రంప్ ఇటీవల తీవ్ర విమర్శలు చేశారు. 2025 ఫిబ్రవరిలో వైట్‌హౌస్‌లో ఇద్దరి మధ్య జరిగిన సమావేశం వివాదాస్పదంగా మారినప్పటి నుంచి వారి సంబంధాలు ఇంతగా దిగజారడం ఇదే మొదటిసారి కావచ్చు.సైనిక సహాయం కోసం ఉక్రెయిన్ ఇప్పటికీ అమెరికాపైనే ఎక్కువగా ఆధారపడుతోంది. అమెరికా తయారు చేసిన పేట్రియాట్ క్షిపణి రక్షణ వ్యవస్థలు, నిఘా సమాచారం ఉక్రెయిన్‌కు కీలకంగా ఉన్నాయి.రష్యా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిన వెంటనే గుర్తించే సామర్థ్యం అమెరికాకు ఉంది. గతంలో అమెరికా అధికారులు క్షిపణి ప్రయోగాల గురించి ఉక్రెయిన్‌కు ముందుగానే సమాచారం ఇచ్చేవారు. దీంతో ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు, దూసుకొచ్చే క్షిపణులను అడ్డుకునేందుకు ఉక్రెయిన్ రక్షణ వ్యవస్థలకు అవకాశం లభించేది.అయితే, తాజా దాడులకు ముందు నిఘా సమాచారం ఎందుకు అందలేదని ప్రశ్నించగా.. దీనిని ఒక ‘వైఫల్యం’గా వివరించారని ఉక్రెయిన్‌కు చెందిన సీనియర్ అధికారి తెలిపారు. వాతావరణ పరిస్థితుల వంటి కారణాల వల్ల ఇది జరిగి ఉండొచ్చని, ఉద్దేశపూర్వక నిర్ణయం కాకపోవచ్చని ఆయన సూచించారు. అధికారిక ప్రకటన చేసే అధికారం తనకు లేకపోవడంతో పేరు వెల్లడించవద్దని కోరారు.




**రష్యా వైమానిక దాడులను ఎదుర్కొనేందుకు ఉక్రెయిన్ ఇబ్బందులు...**

గత ఏడాది నుంచి యుద్ధభూమిలో పరిస్థితుల్లో పెద్దగా మార్పులు లేకపోయినా.. రష్యా వైమానిక దాడులు తీవ్రతరం కావడంతో ఉక్రెయిన్ వాటిని అడ్డుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటోంది. వేగంగా దూసుకొచ్చే బాలిస్టిక్ క్షిపణులతో పాటు, అధిక ఎత్తులో ప్రయాణించే జెట్ ఇంజిన్ డ్రోన్లతో రష్యా దాడులు చేస్తోంది.అమెరికా నేతృత్వంలోని ఇరాన్ యుద్ధం కారణంగా పేట్రియాట్ క్షిపణుల కొరత ఏర్పడింది. దీంతో రష్యా క్షిపణులను కూల్చివేయడం ఉక్రెయిన్‌కు మరింత కష్టంగా మారింది. రష్యాకు చెందిన ఇస్కాండర్ స్వల్పశ్రేణి బాలిస్టిక్ క్షిపణులు ఉక్రెయిన్‌లోని లక్ష్యాలను చేరుకోవడానికి కొద్ది నిమిషాలే పడుతుంది.సోమవారం సాయంత్రం నుంచి రష్యా 100కు పైగా ఆయుధాలతో ఉక్రెయిన్‌పై దాడులు చేసిందని జెలెన్‌స్కీ తెలిపారు. ఈశాన్య నగరం ఖార్కివ్‌లో ఓ నివాస భవనం ధ్వంసమై నలుగురు మరణించారని చెప్పారు. రాత్రంతా సహాయక చర్యలు చేపట్టినా వారిని కాపాడలేకపోయారని పేర్కొన్నారు.యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి రష్యా విద్యుత్ కేంద్రాలు వంటి పౌర మౌలిక సదుపాయాలపై దాడులను పెంచింది. దీంతో ఉక్రెయిన్ ప్రజలకు విద్యుత్, వేడి, తాగునీటి సరఫరాను దెబ్బతీయాలని మాస్కో భావిస్తోంది. సుదీర్ఘంగా సాగుతున్న యుద్ధంతో ఉక్రెయిన్ ప్రజల్లో ప్రతిఘటనకు మద్దతు తగ్గుతుందని రష్యా ఆశిస్తున్నట్లు కథనం పేర్కొంది.

**ఇంధన కేంద్రాలపై దాడులు నిలిపామన్న ఉక్రెయిన్...**

అమెరికాలో డీజిల్ ధరలు రికార్డు స్థాయికి చేరడానికి ఉక్రెయిన్ గతంలో రష్యా చమురు శుద్ధి కేంద్రాలపై చేసిన దాడులే కారణమని ట్రంప్ ఆరోపించారు. ఇరాన్ యుద్ధం వల్ల ధరలు పెరిగాయన్న వాదనను ఆయన తోసిపుచ్చారు. అమెరికాలో మధ్యంతర ఎన్నికలకు ముందు ఇంధన ధరలను తగ్గించే ప్రయత్నంలో భాగంగా రష్యా నుంచి డీజిల్ దిగుమతి చేసుకునేందుకు ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో శుక్రవారం ఒప్పందం కుదుర్చుకు న్నట్లు ట్రంప్ తెలిపారు.ఇదిలా ఉండగా, ఇరు దేశాలు ఒకరి ఇంధన మౌలిక సదుపాయా లపై మరొకరు దాడులు చేయకుండా ‘ఇంధన కాల్పుల విరమణ’కు అంగీకరించాయని ట్రంప్ ఆదివారం ప్రకటించారు. అయితే, అలాంటి ఒప్పందం కుదిరినట్లు రష్యా ధ్రువీకరించలేదు. ఈ అంశంపై చర్చలు కొనసాగుతున్నాయని మాత్రమే క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ చెప్పారు.ట్రంప్ ప్రకటన వెలువడినప్పటి నుంచి రెండు రోజులుగా రష్యా చమురు శుద్ధి కేంద్రాలు, ఇతర ఇంధన కేంద్రాలపై ఉక్రెయిన్ దాడులు చేయలేదని జెలెన్‌స్కీ మంగళవారం తెలిపారు. అదే సమయంలో ఉక్రెయిన్‌లోని ఇంధన కేంద్రాలు, మౌలిక సదుపాయాలపై రష్యా దాడులు కొనసాగించడాన్ని ఆయన తప్పుబట్టారు.“అమెరికా అధ్యక్షుడు చెప్పిన మాటలకు తాము కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదని రష్యన్లు భావిస్తున్నారని వాస్తవాలు చెబుతున్నాయి” అని మంగళవారం రాత్రి దాడుల అనంతరం జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు.ఉక్రెయిన్ ఇంధన కేంద్రాలపై దాడులను నిలిపివేసిందన్న వాదనను స్వతంత్రంగా నిర్ధారించలేకపోయారు. అయితే, కాల్పుల విరమణ ప్రకటన తర్వాత ఉక్రెయిన్ చమురు శుద్ధి కేంద్రాలపై దాడులు జరిగినట్లు రష్యా అధికారులు లేదా అక్కడి మీడియా కథనాలు వెల్లడించలేదు.

**ఖార్కివ్‌లో నలుగురు మృతి.. 41 మందికి గాయాలు...**

సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు ఉక్రెయిన్‌లోని పలు ప్రాంతాలపై రష్యా దాడులు చేసింది. ఖార్కివ్‌లో ఓ అపార్ట్‌మెంట్ భవనం ధ్వంసమై నలుగురు మరణించగా, ఒక్క సాయంత్రంలోనే మరో 41 మంది గాయపడ్డారని జెలెన్‌స్కీ తెలిపారు.కీవ్‌లోని దార్నిట్స్కీ జిల్లాలో ఓ ప్రైవేటు ఇంటిపై రష్యా దాడి చేయడంతో ఓ మహిళ గాయపడినట్లు నగర సైనిక పరిపాలన విభాగం వెల్లడించింది. పశ్చిమ నగరం ల్వివ్ సమీపంలోని మురోవానే గ్రామంలో ఓ నివాస భవనంపై మంగళవారం ఉదయం రష్యా డ్రోన్ దాడి చేసిందని ల్వివ్ మేయర్ ఆండ్రి సడోవీ తెలిపారు.కీవ్ ప్రాంతంలోని ఫాస్టివ్ జిల్లాలో రష్యా దాడిలో ఒకరు మరణించగా, మరో ఇద్దరు గాయపడ్డారని ప్రాంతీయ సైనిక పరిపాలన విభాగం అధిపతి తైమూర్ త్కాచెంకో చెప్పారు.వాయవ్య ఉక్రెయిన్‌లోని రివ్నే నగర నడిబొడ్డున ఉన్న ఓ విద్యాసంస్థపై రష్యా డ్రోన్ దాడి చేయడంతో 14 మంది గాయపడ్డారని ప్రాంతీయ సైనిక పరిపాలన విభాగం అధిపతి ఒలెక్సాండర్ కోవల్ తెలిపారు.ఉక్రెయిన్‌లోని సైనిక పరిశ్రమల కేంద్రాలు, సరుకు రవాణా కేంద్రాలు, రైల్వేలు, ఓడరేవుల మౌలిక సదుపాయాలతో పాటు, ఉక్రెయిన్‌కు సైనిక సరుకులు తీసుకెళ్తున్న నౌకలపై తమ బలగాలు దాడులు చేశాయని రష్యా రక్షణ శాఖ మంగళవారం ప్రకటించింది.సైనిక సరుకులతో మైకొలైవ్ ఓడరేవుకు వెళ్తున్న ఓ భారీ సరుకు నౌకను నల్ల సముద్ర తీరంలోని బగ్ నది ముఖద్వారం వద్ద లక్ష్యంగా చేసుకున్నామని కూడా వెల్లడించింది.మరోవైపు, రష్యా ప్రాంతాలు, అజోవ్ సముద్రంపై రాత్రి సమయంలో 604 ఉక్రెయిన్ డ్రోన్లను తమ వైమానిక రక్షణ వ్యవస్థలు కూల్చివేశాయని రష్యా రక్షణ శాఖ తెలిపింది. మాస్కో ప్రాంతాన్ని 417 డ్రోన్లు లక్ష్యంగా చేసుకున్నాయని నగర మేయర్ సెర్గీ సోబ్యానిన్ చెప్పారు. వీటిలో చాలా వరకు దూరంగానే కూల్చివేయగా, రష్యా రాజధాని వైపు వస్తున్న 65 డ్రోన్లను అడ్డుకున్నట్లు తెలిపారు.మాస్కోకు నైరుతి దిశలో ఉన్న కలుగా ప్రాంతంలో జరిగిన దాడిలో ఓ పాఠశాల, రెండు ప్రైవేటు ఇళ్లు, ఒక కారు దెబ్బతిన్నాయని ఆ ప్రాంత గవర్నర్ వ్లాదిస్లావ్ షాప్షా తెలిపారు.

# తిరుమలలో అంతగా లేని భక్తుల రద్దీ .. రీజన్ ఇదే




తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. అయితే భక్తులు బ్రహ్మోత్సవాల సమయంలో ఊహించిన దాని కంటే తక్కువగానే చేరుకుంటున్నారు. బయట క్యూ లైన్ల వరకూ వేచి ఉండకుండానే స్వామి వారి దర్శనాన్ని కంపార్ట్ మెంట్లలో వేచి చూసి దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. బ్రహ్మోత్సవాల ప్రారంభ సమయం నుంచి కొంత భక్తుల రద్దీ తిరుమలలో తగ్గింది. దసరా సెలవులకు సొంత గ్రామాలకు బయలుదేరి వెళ్లడంతో తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య తక్కువగా ఉంది. గతంలో మాదిరిగా ఇప్పుడు స్వామి వారి దర్శనానికి ఇబ్బందులుండవని, సులువుగానే దర్శించుకోవచ్చని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తెలిపారు.

**దసరా సెలవులయినా...**

తిరుమలకు సాధారణంగా నిత్యం భక్తుల రద్దీ ఎక్కువగానే ఉంటుంది. సీజన్ తోనూ, పండగలు, పబ్బాలు అనేది లేకుండా స్వామి వారి దర్శనం కోసం బారులు తీరేవారు. కానీ బ్రహ్మోత్సవాల సమయంలో వసతి గృహాలు దొరకవని, దర్శనం కూడా సులువుగా లభించదని భావించి చాలా మంది భక్తులు తిరుమలకు రాకపోయి ఉండవచ్చని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు అభిప్రాయపడుతున్నారు. దసరా సెలవులు పది రోజులకు పైగానే ఉండటంతో ఎక్కువ సమయం సొంతూళ్లలోనే గడిపేందుకు ఎక్కువ మంది ఇష్టపడతారు. ముందుగా టిక్కెట్లు బుక్ చేసుకున్న వారు మాత్రం ఏడు కొండల వాడిని దర్శించుకుని వెళుతున్నారు.

**23 కంపార్ట్ మెంట్లలో...**

ఈరోజు తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని 23 కంపార్ట్ మెంట్లలో భక్తులు శ్రీవారి దర్శనం కోసం వేచి ఉన్నారు. శ్రీవారి సర్వదర్శనం క్యూ లైన్ లోకి ఉదయం టోకెన్లు లేకుండా ప్రవేశించిన భక్తులకు దర్శనం పది గంటలకుపైగానే సమయం పడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తెలిపారు. శీఘ్రదర్శనం టోకెన్లున్న భక్తులకు రెండు గంటలలో దర్శనం పూర్తవుతుంది. నిన్న శ్రీవారిని 84,179 మంది భక్తులు దర్శించుకున్నారు. నిన్న శ్రీవారికి తలనీలాలు సమర్పించిన భక్తుల సంఖ్య 29,644గా ఉంది. నిన్న శ్రీవారి హుండీ ఆదాయం రూ. 3.01 కోట్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. నిన్న శ్రీవారి లడ్డూ ప్రసాదం అమ్మకం 4.49 లక్షలు జరిగినట్లు అధికారులు తెలిపారు. నిన్న2.05 లక్షల మంది భక్తులు తిరుమలలో అన్న ప్రసాదం స్వీకరించినట్లు అధికారులు వెల్లడించారు.

# యూరప్‌లో సూపర్‌మార్కెట్లపై సైబర్ దాడులు

ఫ్రాన్స్‌లో వందలాది సూపర్‌మార్కెట్లలో శీతలీకరణ వ్యవస్థలు సైబర్ దాడుల బారినపడ్డాయి. యూరప్, అమెరికాలో వినియోగదారులకు సేవలందించే ఓ ప్రముఖ రిటైల్ సంస్థ తన వెబ్‌సైట్లను కూడా తాత్కాలికంగా నిలిపివేసింది.ఫ్రాన్స్‌లోని 10 వేల సూపర్‌మార్కెట్లలో సుమారు 700 దుకాణాలపై ఈ దాడి ప్రభావం చూపిందని ఆ దేశ ఆర్థిక మంత్రి రోలాండ్ లెస్క్యూర్ మంగళవారం పార్లమెంటుకు తెలిపారు. అయితే, దేశంలో ఆహార సరఫరాకు ఎలాంటి ముప్పు లేదని చెప్పారు. అదే సమయంలో ఈ దాడి ఆహార భద్రతకు సంబంధించిన కీలక అంశాన్ని తాకిందని అంగీకరించారు.“ఇది అందరికీ ఓ మేల్కొలుపు” అని ఆయన వ్యాఖ్యానించారు.మరోవైపు, నెదర్లాండ్స్‌కు చెందిన ప్రముఖ సూపర్‌మార్కెట్ సంస్థ అహోల్డ్ డెల్‌హైజ్ తన వ్యవస్థల్లో భద్రతా సమస్య తలెత్తడంతో వాటిని నిలిపివేసినట్లు తెలిపింది. వాటిని తిరిగి అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు మంగళవారం వెల్లడించింది.నెదర్లాండ్స్‌లోని ఆల్బర్ట్ హైజన్, బెల్జియంలోని డెల్‌హైజ్, అమెరికాలోని స్టాప్ అండ్ షాప్, ఫుడ్ లయన్, జెయింట్ దుకాణాలు మాత్రం తెరిచే ఉన్నాయని సంస్థ తెలిపింది. అయితే, ఆయా బ్రాండ్ల వెబ్‌సైట్లు మంగళవారం కూడా పనిచేయలేదు. వినియోగదారులు, ఉద్యోగులకు సంబంధించిన సమాచారం చోరీకి గురైనట్లు ఎలాంటి ఆధారాలు లేవని అహోల్డ్ డెల్‌హైజ్ స్పష్టం చేసింది.ఫ్రాన్స్‌లో భారీ స్థాయిలో జరిగిన ఈ సైబర్ దాడిపై పారిస్ ప్రాసిక్యూటర్ కార్యాలయంలోని సైబర్ నేరాల విభాగం దర్యాప్తు చేపట్టింది. ఆహారం పాడవడం, మంటలు చెలరేగినట్లు వచ్చిన నివేదికలతో పాటు నష్టంపై విచారణ జరుపుతోంది.బీఎఫ్ఎం టీవీ కథనం ప్రకారం.. హ్యాకర్లు దుకాణాల్లోని శీతలీకరణ వ్యవస్థలను నిరంతరం డీఫ్రాస్ట్ అయ్యేలా మార్చారు. ఉష్ణోగ్రతలను 50 డిగ్రీల సెల్సియస్ (122 డిగ్రీల ఫారెన్‌హీట్) వరకు పెంచారు.

**300 ఇంటర్‌మార్షే, నెట్టో దుకాణాలపై ప్రభావం...**

యూరప్ వ్యాప్తంగా 4,000కుపైగా దుకాణాలను నిర్వహించే ఫ్రాన్స్ రిటైల్ సంస్థ గ్రూప్‌మెంట్ మౌస్కెటైర్స్ పరిధిలోని ఇంటర్‌మార్షే, నెట్టో సూపర్‌మార్కెట్లలో 300 దుకాణాలు ప్రభావితమయ్యాయి. కొన్ని దుకాణాల్లో చల్లబరిచిన ఆహార పదార్థాలు, గడ్డకట్టించిన ఆహారాన్ని ప్రదర్శించే ఫ్రిజ్ విభాగాలు మంగళవారం కూడా పనిచేయలేదు.ఫ్రాన్స్‌కు చెందిన మరో రిటైల్ సంస్థ కోఆపరేటివ్ యూ సీఈవో డొమినిక్ షెల్చర్ మాట్లాడుతూ.. తమ సంస్థకు చెందిన 2,000 దుకాణాల్లో 80 దుకాణాలు ప్రభావితమయ్యాయని చెప్పారు. చాలా దుకాణాల్లో శీతలీకరణకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నప్పటికీ, కొన్ని చోట్ల ఆహార పదార్థాలను పారేయాల్సి వచ్చిందని ఆయన ఎక్స్‌లో వెల్లడించారు.“తాజా ఆహార పదార్థాలను భద్రపరిచే పరికరాలపై దాడి చేయడం ఫ్రాన్స్ ఆహార సరఫరా వ్యవస్థపై దాడి చేయడమే. ఇది గతంలో ఎన్నడూ లేనంతటి ఘటన. అత్యంత తీవ్రమైనది, ఆమోదయోగ్యం కానిది” అని షెల్చర్ వ్యాఖ్యానించారు.కారెఫోర్, మోనోప్రి సూపర్‌మార్కెట్లు కూడా ఈ దాడి ప్రభావానికి గురయ్యాయి.

**పాత శీతలీకరణ వ్యవస్థల్లో భద్రతా లోపాలు...**

డెన్మార్క్‌కు చెందిన డాన్‌ఫాస్, అమెరికాకు చెందిన కోప్‌లాండ్ సంస్థలు తయారు చేసిన శీతలీకరణ వ్యవస్థల రిమోట్ కంట్రోల్ మాడ్యూళ్లలో అనేక భద్రతా లోపాలను గుర్తించినట్లు ఫ్రాన్స్ ప్రభుత్వ సైబర్ భద్రతా సంస్థ మంగళవారం తెలిపింది.ప్రభావితమైన వ్యవస్థల్లో చాలావరకు పాత ఉత్పత్తులేనని, వాటికి సాఫ్ట్‌వేర్, భద్రతా అప్‌డేట్లు అందడం లేదని డాన్‌ఫాస్ సోమవారం వెల్లడించింది. నష్టాన్ని తగ్గించేందుకు ప్రభావిత వినియోగదారులతో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపింది.మద్దతు ఉన్న వ్యవస్థలకు తాజా ఫర్మ్‌వేర్ అప్‌డేట్లు ఇన్‌స్టాల్ చేయాలని, ఫైర్‌వాల్ రక్షణ వెనుక వాటిని నిర్వహించాలని వినియోగదారులకు చాలాకాలంగా సూచిస్తున్నట్లు డాన్‌ఫాస్ పేర్కొంది.అమెరికాకు చెందిన సైబర్ భద్రతా సంస్థ క్లారోటీ ఆగస్టులో విడుదల చేసిన నివేదికలో డాన్‌ఫాస్ ఏకే-ఎస్ఎం 800ఏ, కోప్‌లాండ్ ఎక్స్‌వెబ్ ప్రో ప్లాట్‌ఫామ్‌లలో భద్రతా లోపాలను గుర్తించింది. సూపర్‌మార్కెట్లు, గిడ్డంగులు, ఇతర కేంద్రాల్లో శీతలీకరణ వ్యవస్థలను నిర్వహించేందుకు వీటిని ఉపయోగిస్తారు.డాన్‌ఫాస్ వ్యవస్థను ఉపయోగించే అనేక కంట్రోలర్లు నేరుగా పబ్లిక్ ఇంటర్నెట్‌కు అందుబాటులో ఉన్నాయని క్లారోటీ తెలిపింది. దీనివల్ల సైబర్ దాడులు చేసే వారికి సులభంగా అవకాశం లభించిందని పేర్కొంది. అయితే, డాన్‌ఫాస్, కోప్‌లాండ్ సంస్థలు ఆ లోపాలను సరిచేశాయని కూడా వెల్లడించింది.వినియోగం నిలిపివేసిన, జీవితకాలం ముగిసిన పాత తరం కంట్రోలర్లలో ఓ భద్రతా లోపాన్ని గుర్తించినట్లు కోప్‌లాండ్ మంగళవారం తెలిపింది. ప్రభావిత వినియోగదారులతో కలిసి పనిచేస్తున్నట్లు పేర్కొంది.వర్జీనియా కామన్‌వెల్త్ యూనివర్సిటీకి చెందిన హోంల్యాండ్ సెక్యూరిటీ, అత్యవసర సంసిద్ధత విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ క్రిస్టోఫర్ వైట్ మాట్లాడుతూ.. ఇలాంటి దాడులు చేయడం పెద్ద కష్టమేమీ కాదన్నారు.“సూపర్‌మార్కెట్ ఉపయోగిస్తున్న విస్తృత నెట్‌వర్క్‌కు ఈ నియంత్రణ వ్యవస్థలను తెరిచి ఉంచడం వల్లే ఈ ఘటన జరిగి ఉండొచ్చు” అని ఆయన అభిప్రాయపడ్డారు.నీటి సరఫరా వ్యవస్థలు, విద్యుత్ మౌలిక సదుపాయాలు, ఇతర భౌతిక కార్యకలాపాలపై ఇలాంటి దాడులు కొన్నేళ్లుగా చోటుచేసుకుంటున్నాయని వైట్ తెలిపారు. ఇరాన్ సహా పలు దేశ ప్రభుత్వాలకు చెందిన దాడి చేసేవారి నుంచి ఇటువంటి ముప్పులు ఎదురవుతున్నాయని చెప్పారు. ఈ వేసవిలో అమెరికాలోని మిన్నెసోటా, మిచిగన్ రాష్ట్రాలు తమ నీటి సరఫరా వ్యవస్థలపై సైబర్ దాడులు జరిగినట్లు వెల్లడించాయి.రిఫ్రిజిరేషన్ వ్యవస్థలపై దాడులు కొత్తేమీ కాదని వైట్ పేర్కొన్నారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం..

## చిన్న జాగ్రత్తలు.. పెద్ద ఆరోగ్యాన్ని కాపాడతాయి



ఆరోగ్యంగా ఉంటేనే.. ఆనందంగా ఉంటాం..



## ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

**హైదరాబాద్:** ఆరోగ్యం అనేది మన జీవితానికి పునాది. వేగంగా మారుతున్న జీవనశైలి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ తగ్గడం వంటి కారణాలతో అనేక వ్యాధులు పెరుగుతున్నాయి. కాబట్టి ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై విశేష శ్రద్ధ తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

### నివారణే ఉత్తమ మార్గం

ప్రతి రోజూ సరైన ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, తగినంత నిద్రపోవడం, ఒత్తిడిని దూరం పెట్టడం వంటివి ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులు వంటి దీర్ఘకాలిక వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవడం అవసరం.

### ఆరోగ్యంగా ఉండాలంటే ఇవి పాటించండి

**సమతుల ఆహారం**
పండ్లు, కూరగాయలు, పచ్చి కూరలు, పోషికాహారం తీసుకోవాలి.

**నిత్యం వ్యాయామం**
రోజూ కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయాలి.

**తగినంత నీరు**
రోజుకు 8–10 గ్లాసుల నీరు తాగాలి.

**పూర్తి నిద్ర**
రోజుకు 7–8 గంటల నిద్ర తప్పనిసరి.

**పొగాకు, మద్యం మానండి**
ఇవి అనేక వ్యాధులకు దారితీస్తాయి.

**ఒత్తిడి తగ్గించుకోండి**
యోగ, ధ్యానం, మంచి ఆలోచనలతో మనసు ప్రశాంతంగా ఉంచుకోండి.

**నియమిత ఆరోగ్య పరీక్షలు**
సమయానికి వైద్యుల వద్ద చెకప్ చేయించుకోవాలి.

**ఆరోగ్యంగా జీవిద్దాం.. సంతోషంగా ఉండండి..**

# పొరపడినా.. భయపడినా అనర్థం తప్పదు

## ఇది రొమ్ముక్యాన్సర్ అవగాహన మాసం



**రొమ్ముక్యాన్సర్ మీద ఇప్పుడు అవగాహన పెరిగిన మాట నిజం. దీని గురించి అందరికీ అంతో ఇంతో తెలుసన్నా అతిశయోక్తి కాదేమో. అయినా పొరపాట్లు జరుగుతూనే ఉన్నాయి. కొందరు మామూలు గడ్డలుగా భావించి, నిర్లక్ష్యం చేస్తుంటే.. మరికొందరు సరైన పరీక్షలు చేయించుకోక తీవ్రదశకు తెచ్చుకుంటున్నారు. ఇంకొందరు శస్త్రచికిత్సకు భయపడి ఆమోదం పొందని చికిత్సలకు మొగ్గుచూపుతూ చేజేతులా ముదిరేలా చేసుకుంటున్నారు. అలాంటి ఉదాహరణలు ఇవిగో. వీటితో ఏం నేర్చుకోవాలో తెలుసుకుందాం.**

ప్రస్తుతం రొమ్ముక్యాన్సర్‌కు సమర్థ చికిత్సలు ఉన్నాయి. రొమ్మును పూర్తిగా తొలగిస్తారేమోననే భయమూ అక్కర్లేదు. ఒకవేళ రొమ్మును తొలగించినా పునర్నిర్మించే సౌందర్య చికిత్సలూ అందుబాటులో ఉన్నాయి. కాకపోతే వీలైనంత త్వరగా గుర్తించటం, కచ్చితంగా నిర్ధారించటం చాలా ముఖ్యం. అప్పుడే సరైన చికిత్స సాధ్యం. రొమ్ముక్యాన్సర్ బారినపడ్డ అందరికీ కోర్ బయాప్సీతోనే నిర్ధారించాలి. ఎందుకంటే కొందరికి ఫైన్ నీడిల్ ఆస్పిరేషన్ పనికిరాదు. అలాగే క్యాన్సర్ ఎలాంటి రకమో, ఏ దశలో ఉందో కూడా కచ్చితంగా గుర్తించాలి. రొమ్ముక్యాన్సర్ కణస్థాయిలో ల్యూమినల్ ఎ, ల్యూమినల్ బి.. హర్2 పాజిటివ్, ట్రిపుల్ నెగెటివ్ ఇలా నాలుగు రకాలుగా ఉంటుంది. ట్రిపుల్ నెగెటివ్ చాలా వేగంగా ముదురుతుంది. దీనికి గడ్డ చిన్నగా ఉంటే తప్ప చాలావరకూ ముందు కీమోథెరపీ ఇచ్చి, తర్వాత శస్త్రచికిత్స చేస్తారు. అలాగే హర్2లోనూ ఇలాగే చేస్తారు. అందువల్ల కోర్ బయాప్సీతో నిర్ధారణ చేసే సమయంలోనే ఈస్ట్రోజన్ రిసెప్టర్ (ఈఆర్), ప్రొజెస్టిరాన్ రిసెప్టర్ (పీఆర్), హెచ్‌ఈఆర్2ఎన్‌ఈయూ, కేఐ67 పరీక్షలు చేయటం చాలా ముఖ్యం. వీటితో క్యాన్సర్ రకం బయటపడుతుంది. ఇక మామోగ్రామ్, కడుపు, ఛాతీ సీటీ స్కాన్, ఎముక స్కాన్ లేదా శరీరం మొత్తం పెట్ సీటీ చేస్తే క్యాన్సర్ దశ బయటపడుతుంది. వీటిని బట్టే సరైన చికిత్సను నిర్ణయించటం సాధ్యమవుతుంది. ఈ క్రమంలో ఎక్కడ గాడి తప్పినా చికిత్స ఫలితం మీద ప్రభావం పడుతుంది. గోరుతో పోయేదాన్ని గొడ్డలి దాకా తెచ్చుకున్నట్టవుతుంది. అందువల్ల పొరపాట్లకు, భయాలకు తావివ్వకుండా చూసుకోవటం మంచిది.

**మామూలు గడ్డనే నిర్లక్ష్యం తగదు**

ఆమెకు 25 ఏళ్లు. ఇంకా పెళ్లి కాలేదు. మంచి కంపెనీలో పని చేస్తోంది. నెల క్రితం కుడి రొమ్ములో చిన్న గడ్డ ఏర్పడింది. నొప్పేమీ లేదు. తనకు తెలిసిన డాక్టర్ దగ్గరికి వెళ్తే అదేమీ పెద్ద సమస్య కాదని చెప్పారు. విటమిన్ ఇ మాత్రలు రాసిచ్చారు. డాక్టర్ ఇచ్చిన భరోసాతో ఆమె నిశ్చితంగా ఉంది. ఉద్యోగపనుల్లో పడిపోయి పట్టించుకోవటం మానేసింది. గడ్డ నెమ్మదిగా పెరుగుతూ, ఆరు నెలల తర్వాత నిమ్మకాయంత సైజుకు చేరుకుంది. మళ్లీ డాక్టర్ దగ్గరికి వెళ్లి చూపించుకున్నారు. ఈసారి మామోగ్రామ్ చేయించుకోవాలని సూచించారు. రొమ్ము కణజాలం దళసరిగా ఉందని, అసాధారణ మార్పులు అస్పష్టంగా ఉన్నట్టు పరీక్ష రిపోర్టు వచ్చింది. అనంతరం డాక్టర్ ఆమెను గైనకాలజిస్టును సంప్రదించాలని చెప్పారు. గైనకాలజిస్ట్‌కు అనుమానం వచ్చి, క్యాన్సర్ నిపుణుడి దగ్గరకు పంపించారు. రొమ్ములో 4 సెం.మీ. కణితి ఉన్నట్టు తేలింది. ఆ వెంటనే చికిత్స ఆరంభించారు. కీమోథెరపీ అనంతరం రొమ్ములో కణితి ఉన్న భాగాన్ని తొలగించారు. సొట్ట కనిపించకుండా ప్లాస్టిక్ సర్జరీతో పునర్నిర్మించారు.

తెలుసుకోవాల్సిన విషయం: క్యాన్సర్ అరుదే కావొచ్చు. కానీ గడ్డ సైజు వేగంగా పెరుగుతున్నప్పుడు తప్పకుండా అనుమానించాలి. రొమ్ములో మార్పుల గురించి విధిగా క్యాన్సర్ నిపుణులతో చర్చించాలి. తగు పరీక్షలతో నిర్ధారించుకోవాలి. త్వరగా గుర్తిస్తే చికిత్స తేలికవుతుంది. మంచి ఫలితం కనిపిస్తుంది.

**గర్భిణుల్లో మరింత నిశితంగా..**

ఆమె ఇటీవలే గర్భం ధరించింది. వయసు 27 ఏళ్లు. గర్భం ధరించటానికి ముందు రొమ్ములో వేరుశనగంత గడ్డ కనిపించింది. ఫ్యామిలీ డాక్టర్, గైనకాలజిస్ట్ ఏమీ కాదన్నారు. తొలి త్రైమాసికంలో గడ్డ సైజు వేగంగా పెరిగింది. సన్నటి సూదితో నమూనాను తీసి (ఫైన్ నీడిల్ ఆస్పిరేషన్ సైటాలజీ) పరీక్షిస్తే క్యాన్సర్ బయటపడలేదు. ఆరు నెలల తర్వాత గడ్డ సైజు ఇంకా పెరిగింది. ఈసారి క్యాన్సర్ నిపుణుడిని సంప్రదించారు. క్షీరగ్రంథుల్లో తలెత్తిన క్యాన్సర్ చుట్టుపక్కల రొమ్ముకణజాలంలోకి విస్తరించినట్టు తేలింది. కాలేయం, ఊపిరితిత్తుల్లోకీ విస్తరించినట్టు బయటపడింది. అప్పటికే నిర్ధారణ ఆలస్యం కావటంతో చికిత్స చాలా కష్టమైంది. తెలుసుకోవాల్సిన విషయం: రొమ్ముల్లో గడ్డలేవైనా గానీ కోర్ నీడిల్ బయాప్సీ.. అంటే సూది ద్వారా కణజాలం ముక్కను సంగ్రహించి పరీక్షించటం అవసరం. గర్భం ధరించినప్పుడు హార్మోన్ల మార్పులు ఉద్ధృతంగా ఉంటాయి. ఇవి కణజాల ఆకృతిని మారుస్తాయి. కాబట్టి గర్భిణుల్లో ఫైన్ నీడిల్ ఆస్పిరేషన్ కచ్చితమైన నిర్ధారణ పరీక్ష కాదని గుర్తించాలి.

**ముందే గుర్తిస్తే రొమ్ము మిగిలేది**

ఆమె సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. వయసు 40. ఎడమ రొమ్ములో గడ్డ ఏర్పడటం గమనించింది. కానీ పని ఒత్తిడిలో పడిపోయి, పట్టించుకోలేదు. నెమ్మదిగా గడ్డ సైజు పెరుగుతూ వచ్చింది. ఆరు నెలల తర్వాత 5 సెం.మీ. చేరుకుంది. అప్పుడు భయపడిపోయి క్యాన్సర్ నిపుణుడిని సంప్రదించారు. కోర్ బయాప్సీ, ఈస్ట్రోజన్ రిసెప్టర్ (ఈఆర్), ప్రొజెస్టిరాన్ రిసెప్టర్ (పీఆర్), హెచ్‌ఈఆర్2ఎన్‌ఈయూ, కేఐ67.. అలాగే క్యాన్సర్ దశల పరీక్షలన్నీ చేసి స్పష్టంగా నిర్ధారించారు. కీమోథెరపీ అనంతరం చంకల్లో లింఫు నాళాలతో పాటు రొమ్ము మొత్తాన్నీ తొలగించారు. తర్వాత బ్రాకా 1, 2 జన్యు పరీక్షలు చేయగా బ్రాకా 1 పాజిటివ్‌గా తేలింది. సంతానం కలిగిన తర్వాత ముందు జాగ్రత్తగా రెండు వైపులా ఫలోపియన్ గొట్టాలు, అండాశయాలు తొలగించుకోవాలని ఆమెకు సూచించారు.

తెలుసుకోవాల్సిన విషయం: తాత్సారం చేయకుండా ముందుగానే గుర్తించినట్టయితే రొమ్మును పూర్తిగా తొలగించాల్సిన పరిస్థితి తప్పి ఉండేది.

**ఇతర చికిత్సల మోజులో పడొద్దు**

ఆమెకు 66 ఏళ్లు. రొమ్ముక్యాన్సర్ ఉన్నట్టు బయటపడింది. లింఫ్‌గ్రంథులకు గానీ ఇతర భాగాలకు గానీ విస్తరించలేదు. శస్త్రచికిత్స చేసి, కణితి భాగాన్ని తొలగించాలని క్యాన్సర్ నిపుణులు సూచించారు. కానీ ఆమె శస్త్రచికిత్సకు భయపడి, ఆహార నియమాలతో తగ్గించుకోవాలని భావించారు. రెండు నెలల తర్వాత కణితి సైజు పెరిగింది. దీంతో నాలుగు నెలల పాటు ఆయుర్వేద చికిత్స తీసుకున్నారు. ఈసారి కణితి 6 సెం.మీ. అయ్యింది. తిరిగి క్యాన్సర్ నిపుణుల దగ్గరకు వెళ్లారు. పెట్ స్కాన్ చేశారు. చంకల్లో లింఫు నాళాలకు తప్పించి, మరే భాగానికీ క్యాన్సర్ విస్తరించలేదని తేలింది. అప్పటికీ ఆమె చికిత్స తీసుకోవటానికి ఇష్టపడలేదు. డాక్టర్ పట్టుబట్టి చికిత్స ఆరంభించారు. ఈస్ట్రోజన్, ప్రొజెస్టిరాన్ రిసెప్టర్ పాజిటివ్‌గా ఉండటంతో ఆరోమటేజ్ ఇన్‌హిబిటార్స్ ఆరంభించారు. కణితి సైజు తగ్గింది. ఏడాది వరకూ అలాగే ఉంది. తెలుసుకోవాల్సిన విషయం: ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదం పొందని చికిత్సలకు మొగ్గుచూపొద్దు. అంతగా కావాలనుకుంటే ఇతర పద్ధతుల గురించి డాక్టర్‌తో సంప్రదించి, సరైన నిర్ణయం తీసుకోవాలి.

## ఉప్పల్‌లో టీమిండియా ఓటమి.. 2-2తో
# సిరీస్ సమం చేసిన విండీస్




హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం (ఉప్పల్) వేదికగా జరిగిన నాలుగో టీ20 మ్యాచ్‌లో వెస్టిండీస్ బౌలర్ల దెబ్బకు భారత జట్టు ఘోరంగా ఓడిపోయింది. విండీస్ నిర్దేశించిన 248 పరుగుల లక్ష్య ఛేదనలో టీమిండియా తడబడి, 24 పరుగుల తేడాతో పరాజయం చవిచూసింది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను వెస్టిండీస్ 2-2 తేడాతో సమం చేసింది. ఈ ఉత్కంఠభరిత పోరులో కీమో పాల్ ఐదు వికెట్లతో చెలరేగి భారత్ విజయానికి గండికొట్టగా, మ్యాచ్ మధ్యలో పేసర్ అర్షదీప్ సింగ్ గాయంతో రిటైర్డ్ హర్ట్ కావడంతో 19.3 ఓవర్లలోనే టీమిండియా ఆలౌట్ అయింది.

**కీమో పాల్ వీరవిహారం:**

248 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టుకు ఓపెనర్లు మంచి ఆరంభమే ఇచ్చినా, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. ముఖ్యంగా వెస్టిండీస్ బౌలర్ కీమో పాల్ టీమిండియా ఇన్నింగ్స్‌ను శాసించాడు. ఒకే ఓవర్లో నితీష్ కుమార్ రెడ్డి (41 పరుగులు), ప్రిన్స్ యాదవ్ (గోల్డెన్ డక్), అక్షర్ పటేల్ (3 పరుగులు)లను పెవిలియన్‌కు పంపి మ్యాచ్ స్వరూపాన్ని పూర్తిగా మార్చేశాడు. ఈ మ్యాచ్‌లో మొత్తం 5 వికెట్లు పడగొట్టి ఇండియా విజయావకాశాలను దెబ్బతీశాడు. ఆయనతో పాటు గుడకేష్ మోటీ 2 వికెట్లు తీసుకోగా, షామర్ స్ప్రింగర్, రొమారియ షెఫర్డ్ తలో వికెట్ తీసుకుని భారత్‌ను కోలుకోలేని దెబ్బతీశారు.

**పోరాడి ఓడిన భారత బ్యాటర్లు:**

భారత జట్టు తరపున సంజు శాంసన్, తెలుగు కుర్రాళ్లు తిలక్ వర్మ (43), నితీష్ కుమార్ రెడ్డి (41), అభిషేక్ శర్మ (29) పోరాడినప్పటికీ 248 పరుగుల లక్ష్యాన్ని మాత్రం చేరుకోలేకపోయారు. ముఖ్యంగా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (16), ఇషాన్ కిషన్ (6), నమన్ ధీర్ (0), అక్షర్ పటేల్ (3) బ్యాటింగ్‌లో పూర్తిగా విఫలమయ్యారు.

దీనికి తోడు పేసర్ అర్షదీప్ సింగ్ గాయం కారణంగా రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగడం జట్టు 223 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో 24 పరుగుల తేడాతో ఇండియా ఓడిపోయింది. ఇక ఐదో టీ20 మ్యాచ్ బెంగళూరు వేదికగా అక్టోబర్ 17వ తేదీన జరగనుంది.

# ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారత బ్యాటర్ల హవా..
# శ్రేయస్ అయ్యర్‌కు కెరీర్ బెస్ట్ ర్యాంక్!

- టీ20 ర్యాంకింగ్స్‌లో నాలుగో స్థానానికి దూసుకెళ్లిన శ్రేయస్
- తొలి టీ20 సెంచరీతో కెరీర్లోనే అత్యుత్తమ ర్యాంక్ సాధించిన వైనం
- టాప్-4లో ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, అయ్యర్‌తో ముగ్గురు భారతీయులు
- టెస్టుల్లో నంబర్ వన్ ఆల్‌రౌండర్‌గా రవీంద్ర జడేజా స్థానం పదిలం
- ఆసీస్, పాక్, దక్షిణాఫ్రికా ఆటగాళ్ల ర్యాంకుల్లోనూ కీలక మార్పులు




భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో తన కెరీర్‌లోనే అత్యుత్తమ ర్యాంకును అందుకున్నాడు. వెస్టిండీస్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో అద్భుత ప్రదర్శన చేసిన అయ్యర్, మూడు స్థానాలు ఎగబాకి నాలుగో ర్యాంకును కైవసం చేసుకున్నాడు. లక్నో వేదికగా జరిగిన సిరీస్‌లోని తొలి మ్యాచ్‌లో తన తొలి టీ20 అంతర్జాతీయ శతకాన్ని నమోదు చేయడం అతడి ర్యాంకు భారీగా పెరగడానికి కారణమైంది. అయ్యర్ రాకతో టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో టాప్-4లో ముగ్గురు భారత ఆటగాళ్లు చోటు దక్కించుకోవడం విశేషం. ఇషాన్ కిషన్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా, అభిషేక్ శర్మ రెండో స్థానంలో ఉన్నాడు. పాకిస్థాన్ కెప్టెన్ సాహిబ్జాదా ఫర్హాన్ మూడో స్థానంలో నిలిచాడు. ఇదే సిరీస్‌లో రాణించిన మరో భారత ఆటగాడు సంజూ శామ్సన్ కూడా నాలుగు స్థానాలు మెరుగుపరుచుకుని 27వ ర్యాంకుకు చేరుకున్నాడు.

ఇక బౌలింగ్ విషయానికి వస్తే.. భారత్‌తో సిరీస్‌లో రాణించిన వెస్టిండీస్ ఆటగాడు రోస్టన్ చేజ్ 24 స్థానాలు ఎగబాకి 23వ ర్యాంకులో నిలిచాడు. ఆల్‌రౌండర్ల జాబితాలోనూ రెండు స్థానాలు మెరుగుపరుచుకుని మూడో స్థానానికి చేరుకున్నాడు. పాకిస్థాన్ బౌలర్ సల్మాన్ మీర్జా 14వ స్థానానికి, సయీం అయూబ్ 54వ స్థానానికి మెరుగుపడ్డారు.

**టెస్టుల్లోనూ కీలక మార్పులు**

దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 214 పరుగుల తేడాతో విజయం సాధించడంతో టెస్టు ర్యాంకింగ్స్‌లోనూ పలు మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ మ్యాచ్‌లో 190, 82 పరుగులతో అద్భుత ప్రదర్శన చేసి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచిన ఆస్ట్రేలియా బ్యాటర్ మాథ్యూ రెన్షా, ఏకంగా టాప్-100 బయట నుంచి 49వ ర్యాంకుకు దూసుకొచ్చాడు. ఆసీస్ బౌలర్ జోష్ హేజిల్‌వుడ్ కెరీర్ బెస్ట్ గణాంకాలతో (6/49) రెండు స్థానాలు మెరుగుపరుచుకుని ఏడో ర్యాంకుకు చేరుకున్నాడు. మిచెల్ స్టార్క్ అగ్రస్థానంలోనే కొనసాగుతున్నాడు. భారత స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా టెస్టు ఆల్‌రౌండర్ల జాబితాలో తన నంబర్ వన్ స్థానాన్ని పదిలంగా ఉంచుకున్నాడు. మరోవైపు, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్ మధ్య జరిగిన టెస్టులో రాణించిన రహ్మత్ షా 13వ ర్యాంకుకు, లిటన్ దాస్ 29వ ర్యాంకుకు చేరుకున్నారు.

## అభిషేక్ శర్మ రికార్డు బద్దలు కొట్టిన పాక్ కెప్టెన్ ఫర్హాన్!



పాకిస్థాన్ కెప్టెన్ సాహిబ్జాదా ఫర్హాన్ టీ20 క్రికెట్‌లో ప్రపంచ రికార్డు సృష్టించాడు. శ్రీలంకతో జరిగిన మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 238 పరుగులు సాధించి, భారత ఆటగాడు అభిషేక్ శర్మ నెలకొల్పిన 229 పరుగుల రికార్డును అధిగమించాడు. ఫర్హాన్ చివరి మ్యాచ్‌లోనూ 76 పరుగులతో రాణించాడు. అయితే, ఈ మ్యాచ్‌లో శ్రీలంక 8 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌పై విజయం సాధించింది. కుశాల్ మెండిస్ 87 పరుగులతో జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించాడు. అయినప్పటికీ పాకిస్థాన్ తొలి రెండు మ్యాచ్‌ల్లో గెలవడంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకుంది.

# ఫ్లాప్ హీరోపై మళ్లీ 'వందల కోట్లు' నమ్మకం..!



తెల్లని లేస్ కార్సెట్ టాప్ మరియు డెనిమ్ షార్ట్స్‌లో యాషికా ఆనంద్ మెరుపులు



కేజీఎఫ్‌తో పాన్ ఇండియా స్టార్‌గా మారిన యశ్ ఇటీవల 'టాక్సిక్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చి తీవ్రంగా నిరాశ పరిచిన విషయం తెల్సిందే. కన్నడ ప్రేక్షకులు మినహా టాక్సిక్ సినిమాను మరే భాష ప్రేక్షకులు చూసేందుకు ఆసక్తి చూపించలేదు. అంతే కాకుండా యశ్ పై తీవ్ర విమర్శలు వచ్చాయి. దాదాపు రెండేళ్లు వెయిట్ చేసి నువ్వు ఎంపిక చేసుకున్న స్క్రిప్ట్ ఇదా అంటూ యశ్ ను ఓ రేంజ్‌లో ట్రోల్స్ చేశారు. అంతే కాకుండా దర్శకురాలును కాదని యశ్ సినిమాను తీసినట్లుగా అనిపించిందనే విమర్శలు సైతం వచ్చాయి. కేజీఎఫ్ సినిమా కేవలం ప్రశాంత్ నీల్ వల్ల హిట్ అయింది, కనుక యశ్ మళ్లీ ఆ రేంజ్ సినిమాల కోసం ప్రయత్నాలు చేయక పోవడం మంచిదని కొందరు సలహా ఇచ్చారు. కాస్త కిందికి దిగి యశ్ సినిమాలు చేస్తే బెటర్ అని, లేదంటే కెరీర్ చిక్కుల్లో పడే అవకాశాలు ఉన్నాయంటూ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

**యశ్ టాక్సిక్ మూవీ తర్వాత...**

టాక్సిక్ సినిమా ఫలితం తర్వాత కూడా యశ్ మళ్లీ అదే స్థాయి సినిమాను చేయాలని, మళ్లీ కేజీఎఫ్ రేంజ్ హిట్ కొట్టాలని ఆశ పడుతున్నాడు. అందుకోసం స్క్రిప్ట్‌ను చూస్తున్నాడు, ఆ రేంజ్‌లో సినిమాను తీసే వారిని, ఆ స్థాయిలో బడ్జెట్ ఖర్చు చేసే వారిని యశ్ చూస్తున్నట్లు కన్నడ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఫైనల్‌గా యశ్ తో పీఎస్ మిత్రన్ ఒక భారీ సినిమాను చేసేందుకు రెడీ అయ్యాడు. ఆ మధ్య ధనుష్ తో మిత్రన్ అనుకున్న సినిమాను కొన్ని కారణాల వల్ల యశ్ తో చేసేందుకు సంజయ్ లీలా భన్సాలీ రెడీ అయ్యాడని వార్తలు వస్తున్న విషయం తెల్సిందే. అయితే భారీ ఫారెస్ట్ అడ్వెంచర్ మూవీ కావడంతో సినిమాకు వందల కోట్ల బడ్జెట్ ఖర్చు అవుతుందని అంటున్నారు. యశ్ పై ఆ స్థాయిలో ఖర్చు పెట్టడం ఎంత వరకు కరెక్ట్ అంటూ కొందరు ఈ సందర్భంగా ప్రశ్నిస్తున్నారు. యశ్ పై బలమైన కంటెంట్ ఉంటే తప్ప ఖర్చు పెట్టకూడదని విశ్లేషకులు అంటున్నారు.

**సంజయ్ లీలా భన్సాలీ నిర్మాణంలో...**

సంజయ్ లీలా భన్సాలీ ఈ సినిమాను నిర్మించేందుకు రెడీగా ఉన్నాడు. అయితే యశ్ ను సైతం నిర్మాణ భాగస్వామిగా చేర్చే అంశమై పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. పీఎస్ మిత్రన్ హాలీవుడ్ మూవీ ఇండియానా జోన్స్ రేంజ్‌లో ఒక స్క్రిప్ట్ ను రెడీ చేశాడట. విదేశాల్లో ఎక్కువగా షూట్ ఉంటుందని అంటున్నారు. కనుక ఈ సినిమా కచ్చితంగా భారీ బడ్జెట్ మూవీగా నిలిచే అవకాశాలు ఉన్నాయి. పీఎస్ మిత్రన్ గత చిత్రాల ఫలితాలను చూస్తే ఇప్పుడు ఇలాంటి మూవీ అవసరమా అనే అభిప్రాయం కలుగక మానదు. మిత్రన్, యశ్ కాంబో అంటే కనీసం బజ్ క్రియేట్ అయ్యే పరిస్థితి లేదు. సినిమా మొదలు అయితే ఏమైనా మ్యాజిక్ జరిగి బజ్ క్రియేట్ అవుతుందా అనేది చూడాలి. సాధారణంగా ఒక సినిమా గురించి చిన్న పుకారు వచ్చినా సోషల్ మీడియాలో ఆహా... ఓహో అనే రేంజ్ లో ప్రచారం జరుగుతుంది. కానీ ఈ సినిమా గురించి పెద్దగా పట్టించుకునే వారే లేరు.



దిశా పటాని గ్లామరస్ లుక్: వైరల్ అవుతున్న లేటెస్ట్ మిర్రర్ సెల్ఫీ

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965